ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
భద్రాద్రి కొత్తగూడెం
BHADRADRI KOTHAGUDEM
శుక్రవారం, 8 మార్చి 2024
5





గురువారం ఉష్ణోగ్రత	కనిష్ఠం	గరిష్ఠం
ఖమ్మం	23	36
భద్రాద్రి కొత్తగూడెం	23	37



శివోహం

- నేడు మహాశివరాత్రి ఉత్సవాలకు ఆలయాలు ముస్తాబు
- ఇరు జిల్లాల్లోని పలు శైవక్షేత్రాల్లో జాతర ఏర్పాట్లు
- అర్ధరాత్రినుంచే ప్రారంభమైన ప్రత్యేక పూజలు



కూసుమంచిలో ముస్తాబైన గణపేశ్వరాలయం

ఖమ్మం సాంస్కృతికం/కొత్తగూడెం సాంస్కృతికం, మార్చి 7: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని శుక్రవారం ప్రత్యేక పూజలకు ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని శైవక్షేత్రాలు ముస్తాబయ్యాయి. అర్ధరాత్రి లింగోద్భవ సమయం నుంచే పలు శివాలయాల్లో ప్రత్యేక పూజలు ప్రారంభమయ్యాయి. దాంతో ఆయా దేవస్థానాల అధికారులు, నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. ఖమ్మం జిల్లాలోని ప్రసిద్ధ శైవక్షేత్రాలకు దీటుగా ఖమ్మం నగరంలోని చారిత్రక ప్రాధాన్యతగల శివాలయాల్లో శివరాత్రి పూజలకు ఏర్పాట్లు చేశారు. శివరాత్రి సందర్భంగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అనేక చోట్ల తిరునాళ్లు జరగనున్నాయి. ముఖ్యంగా జిల్లాలోని తీర్థాల, కూసుమంచి, స్నానాలలక్ష్మీపురం, మధిర తదిర ప్రాంతాల్లో భారీగా జాతరలు జరగనున్నాయి. ఈ జాతరలకోసం ఆర్టీసీ ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసింది. ఖమ్మం నగరంలోనూ ప్రత్యేక పూజలు, భజనలు, శివ పార్వతుల కల్యాణాలు, గ్రామోత్సవాలు నిర్వహించనున్నారు. నగరంలోని పురాతన శివాలయమైన గుంటుమల్లేశ్వరస్వామి ఆలయం, సుగ్గలవారి తోట, బ్రాహ్మణబజార్, ధంసలాపురం తదితర ప్రాంతాల్లోని శివాలయాల్లో ప్రత్యేక పూజలకోసం ఏర్పాట్లు చేశారు. విద్యుత్ లైట్లు, క్యూలైన్లు, తాగునీటి వసతి, తదితర ఏర్పాట్లు చేశారు. రాత్రి శివపార్వతుల కళ్యాణాలు, జాగరణ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. శనివారం గ్రామోత్సవాలకు ఏర్పాట్లు చేశారు.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోనూ మహాశివరాత్రి వేడుకలకు ఆలయాలు ముస్తాబయ్యాయి. కొత్తగూడెం ఎంజీ రోడ్‌లోని శ్రీవిజయ విఘ్నేశ్వరుడి ఆలయం, ప్రగతినగర్‌లోని ఉమామహేశ్వరాలయం, బూడిదగడ్డలోని శివాలయాలతోపాటు లక్ష్మీదేవిపల్లి, విద్యానగర్‌కాలనీ, రామవరం, రుద్రంపూర్, బాబుక్యాంపు తదితర ప్రాంతాల్లోని శివాలయాల్లో జాగరణలు, ప్రత్యేక పూజలు నిర్వహించేందుకు నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. భద్రాద్రి పుణ్యక్షేత్రంలోనూ శివరాత్రి వేడుకలకు ఏర్పాట్లు చేశారు. మోతెగడ్డ తదితర ప్రాంతాల్లోనూ జాతరలకు ఏర్పాట్లు చేశారు.

భద్రాద్రికి శివరాత్రి శోభ..

భద్రాచలం, మార్చి 7: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన భద్రాచలం శివరాత్రి శోభను సంతరించుకుంది. శుక్రవారం శివరాత్రిని పురస్కరించుకొని రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి పవిత్ర గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించనున్నారు. ఇందుకోసం అధికారులు ఏర్పాట్లు చేశారు. శివరాత్రి సందర్భంగా శివాలయాల్లో జరగనున్న శివపార్వతుల కళ్యాణానికి ఆలయ అధికారులు దేవస్థానం నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానం అనుబంధ ఆలయమైన అన్నపూర్ణాదేవి సమేత కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయం ముస్తాబైంది. అదేవిధంగా భద్రాచలంలోని అమరలింగేశ్వరస్వామి ఆలయం, ఉమా రామలింగేశ్వరరస్వామి ఆలయం, అంబసత్రంలోని శివాలయంలో శివరాత్రికి అన్ని ఏర్పాట్లు చేశారు. పట్టణంలోని ఆర్టీసీ ఇన్‌గేట్ దగ్గర ఉన్న శ్రీ కనకదుర్గ మల్లేశ్వరస్వామి దేవస్థానంలో కనకదుర్గ మల్లేశ్వరిల కల్యాణం నిర్వహించనున్నారు. లింగోద్భవం సందర్భంగా విశేషపూజ అభిషేకం, నీరాజన మంత్రపుష్పాలు నిర్వహించనున్నారు.

మహాశివరాత్రికి ముస్తాబైన ఆలయాలు

- పెనుబల్లిలో నేపాల్ రుద్రాక్షలతో 14అడుగుల శివలింగం

7





సంఘీభావం ప్రదర్శిస్తున్న నాయకులు

లోక్‌సభ పోరులో ప్రజలు
బీఆర్ఎస్ పక్షానే

- హామీలు విస్మరించిన కాంగ్రెస్‌ను ఓడించాలి
- ఎంపీలు నామా, వద్దిరాజు, మాజీమంత్రి అజయ్
- ఖమ్మంలో బీఆర్ఎస్ నియోజకవర్గస్థాయి సమావేశం



ప్రసంగిస్తున్న ఎంపీ నామా

ఖమ్మం, మార్చి 7(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): లోక్‌సభ ఎన్నికల్లో ప్రజలు బీఆర్ఎస్ పక్షానే నిలుస్తారని బీఆర్ఎస్‌నేతలు తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను విస్మరించిన కాంగ్రెస్‌ను ఓడించాలని పిలుపునిచ్చారు. ఖమ్మంలోని వీవీసీ ఫంక్షన్‌హాల్‌లో గురువారం బీఆర్ఎస్ ఖమ్మం లోక్‌సభ నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ లోక్‌సభ పక్షనేత, ఖమ్మం లోక్‌సభ బీఆర్ఎస్ అభ్యర్థి నామా నాగేశ్వరరావు మాట్లాడుతూ తన జీవితం ఖమ్మం జిల్లా ప్రజలకు అంకితమన్నారు. జిల్లా ప్రజల ఆశీస్సులు, కార్యకర్తల బలంలో వచ్చే ఎన్నికల్లో విజయం సాధిస్తానని విశ్వాసం వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర సాధన తరుణంలో రాష్ట్ర ఏర్పాటు బిల్లుకు లోక్ సభలో మొదటి ఓటు తానే వేశానన్నారు. కష్టకాలంలో పార్టీకి అండగా ఉన్నవారే నిజమైన కార్యకర్తలన్నారు. కాంగ్రెస్ పార్టీ అబద్ధాలతో అధికారంలోకి వచ్చిందని విమర్శించారు. అధికారంలోకి వచ్చి 90రోజులైనా ఇంకా కొన్ని గ్యారంటీలు పూర్తి కాలేదన్నారు. మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువతాత విద్యుత్‌కోతలు, నీళ్లబాధలు మొదలయ్యాయన్నారు. రైతులకు ఇంతవరకు రైతుబంధు అందలేదన్నారు. పదేళ్ల ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా బీఆర్ఎస్ పాలన సాగిస్తే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన 90రోజుల్లోనే ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. అబద్ధాలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌కు లోక్‌సభ ఎన్నికల్లో గుణపాఠం తప్పదన్నారు. మరో 10 రోజుల్లో కాంగ్రెస్ వందరోజుల సినిమా పూర్తవుతుందని, ఈలోపు రూ.2లక్షల రుణాలమాఫీ, రైతుబంధు సాయం అందించకపోతే తిరుగుబాటు తప్పదన్నారు. కేసులు పెట్టి భయభ్రాంతులకు గురిచేయటం, ఆక్రమించుకోవడం తగదన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో కలిసికట్టుగా పనిచేసి బీఆర్ఎస్ అభ్యర్థి నామా నాగేశ్వరరావును గెలిపించి తీరుతామన్నారు. రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర మాట్లాడుతూ ఖమ్మం ఎంపీ అభ్యర్థి నామా నాగేశ్వరరావు పట్టుదల కలిగిన నాయకుడన్నారు. 2014, 18 అసెంబ్లీ ఎన్నికల్లో జిల్లాలో బీఆర్ఎస్ ఒకస్థానమే గెలిచినా లోక్‌సభ ఎన్నికల్లో మాత్రం బీఆర్ఎస్ భారీ మెజార్టీతో గెలిచిందన్నారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ మాట్లాడుతూ జిల్లా పార్టీ శ్రేణులు సంఘటితంగా పనిచేసి నామా విజయానికి కృషి చేయాలన్నారు. సభలో సత్తుపల్లి మాజీఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య, ఖమ్మం జడ్పీ ఛైర్మన్ లింగాల కమలరాజు, మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు, మెచ్చా నాగేశ్వరరావు, బాణోత్ మదన్‌లాల్, మాజీ ఎమ్మెల్యే చంద్రావతి, డీసీసీబీ మాజీ ఛైర్మన్ కూరాకుల నాగభూషణం, బీఆర్ఎస్ నాయకులు బొమ్మెర రామ్మూర్తి, ఉప్పల వెంకటరమణ, తదితరులు మాట్లాడారు. సమావేశంలో జడ్పీవైస్ ఛైర్మన్ మరికంటి ధనలక్ష్మి, కొత్తగూడెం బీఆర్ఎస్ నాయకులు కోనేరు చిన్ని, సుడా మాజీ ఛైర్మన్, బచ్చు విజయ్‌కుమార్, ఖమ్మం బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సభకు హాజరు కాని కేటీఆర్

ఖమ్మం బీఆర్ఎస్ సమావేశానికి మాజీ మంత్రి, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరవుతారని బీఆర్ఎస్ నేతలు పేర్కొన్నారు. అయితే ఆయన గురువారం కరీంనగర్ సమావేశానికి హాజరు కావటంతో ఖమ్మం సమావేశానికి రాలేకపోయారని పార్టీ నాయకులు తెలిపారు. ఇదిలా ఉండగా రాజ్యసభకు ఎన్నికైన వద్దిరాజు రవిచంద్రను, ఖమ్మం లోక్‌సభ అభ్యర్థి నామా నాగేశ్వరరావు మాజీమంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ శాలువాతో సన్మానించారు.

బీఆర్ఎస్‌కు బీసీలు అండగా నిలవాలి

- కేసీఆర్‌కు కృతజ్ఞతసభలో బీఆర్ఎస్ నేతలు

7

క్రికెట్ ఆడుతుండగా
గుండెపోటు..

చుంచుపల్లిలో యువకుడు మృతి



చుంచుపల్లి, మార్చి7: క్రికెట్ ఆడుతూ గుండెపోటుతో ఓ యువకుడు మృతి చెందిన సంఘటన గురువారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్ర పరిధిలోని చుంచుపల్లి మండలంలో జరిగింది. చుంచుపల్లి మండలం రుద్రంపూర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ క్రీడా ప్రాంగణంలో గౌతంపూర్ పంచాయతీలో నివసిస్తున్న కొనగంటి యశ్వంత్(33) తన స్నేహితులతో కలిసి క్రికెట్ మ్యాచ్ ఆడాడు. మ్యాచ్ ఆడుతుండగా తనకు శ్వాస ఆడటం లేదని, నీరసంగా ఉందని క్రీడాకారులకు చెప్పి మైదానం వీడి అక్కడే ఉన్న ఓ చెట్టు కిందకు వెళ్లి ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. దాంతో తోటి క్రీడాకారులు, స్నేహితులు వెంటనే అతడిని కొత్తగూడెంలోని ఓ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు గుండెపోటుతో మృతి చెందినట్లు నిర్ధారించారు. అప్పటివరకు తమతో కలిసి ఆడుకున్న మిత్రుడు అనంతలోకాలకు వెళ్లిపోవడంతో అతడి స్నేహితులు, క్రీడాకారులు షాక్‌కు గురయ్యారు. యశ్వంత్ నివసిస్తున్న సింగరేణి ప్రాంతంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

సరిహద్దున ఇసుక దందా

- ఆంధ్రా నుంచి యథేచ్ఛగా అక్రమ రవాణా
- లారీల్లో భారీగా సత్తుపల్లికి తరలింపు

6



వ్యాట్ ఈజ్ దిస్..!

'వ్యాట్ రిజిస్ట్రేషన్ జీవోపై లిక్కర్ వ్యాపారుల ఆగ్రహం

- రేపటి నుంచి ఉమ్మడి జిల్లాలో మద్యం రవాణాబంద్
- ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్‌కు వ్యాపారుల అల్టిమేటం
- కొనుగోలుకు ఈ-ఛలానాలు తీసేందుకు నిరాకరణ

ఖమ్మం సంక్షేమవిభాగం, మార్చి 7: ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న 261 మద్యం దుకాణాలు, బార్లు, క్లబ్‌లకు శనివారం నుంచి మద్యం కొనుగోలుకు ఈ-చలానాలు తీయబోమని మద్యం వ్యాపారులు ఎక్సైజ్‌శాఖ డిప్యూటీ కమిషనర్ జనార్ధన్‌రెడ్డికి తెగేసి చెప్పారు. వైన్స్ వ్యాపారులు వ్యాట్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సేల్స్‌ట్యాక్స్ అధికారులు సర్క్యులర్ జారీ చేసి కొత్తగూడెం జిల్లాలోని మణుగూరు, భద్రాచలం, కొత్తగూడెంలో మద్యం రవాణా చేస్తున్న వాహనాలను సీజ్ చేశారు. రెండు రోజులుగా ఆయా వాహనాలను విడుదల చేయకపోవటంతో ఉమ్మడి జిల్లాలోని మద్యం వ్యాపారులు డిప్యూటీ కమిషనర్ జనార్ధన్‌రెడ్డిని ఖమ్మంలోని డీసీ కార్యాలయంలో గురువారం కలిసి తమ గోడును వెల్లబుచ్చారు. ఒక వస్తువు తయారు జరిగిన తర్వాత సెల్లర్(అమ్మకపుదారుడు) మాత్రమే వ్యాట్ పరిధిలోకి వస్తారని, కొనుగోలుదారుడు వ్యాట్ పరిధిలోకి రాడని వివరించారు. మద్యం తయారీ సంస్థలు మాత్రమే వ్యాట్ పరిధిలోకి వస్తాయని, తామేందుకు వ్యాట్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని ప్రశ్నించారు. మద్యం దుకాణాల టెండర్ దాఖలు సమయంలో ఇటువంటి నిబంధన పెట్టలేదని, రాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా ఖమ్మంలోనే మద్యం రవాణా వాహనాలను నిలుపుదల చేస్తున్నారని విమర్శించారు. దీంతో స్పందించిన డిప్యూటీ కమిషనర్ ఈ సమస్యను రాష్ట్రస్థాయి అధికారులకు తెలియజేస్తామని తెలిపారు.

శనివారం నుంచి కొనుగోలు ఈ-చలానాలు బంద్

ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లా మద్యం వ్యాపారులు 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ మద్యం తయారు చేసే డిస్టలరీలు మాత్రమే వ్యాట్ పరిధిలోకి వస్తాయని, కొత్తగూడెం జిల్లాలో మూడు మద్యం రవాణా వాహనాలను నిలుపుదలకు నిరసనగా శనివారం నుంచి సమస్య పరిష్కారం అయ్యే వరకు మద్యం కొనుగోలకు వ్యాపారులు ఈ-చలానాలు తీయబోరని తెలిపారు. శనివారం వైరా మద్యం పంపిణీ డిపో ఎదుట నిరసన చేపడతామని మద్య వ్యాపారులు వివరించారు. సంఘం నాయకులు గుర్రాల శ్రీనివాసరెడ్డి, నాగభూషణరెడ్డి, సుబ్బారావు, గోవిందరాజు, గొర్రెపాటి రమేశ్, రాధాకృష్ణ, వెంకటేశ్వరరావు, చింతాల సత్యనారాయణ, నాగేశ్వరరావు, రామకృష్ణ డిప్యూటీ కమిషనర్‌ను కలిసిన వారిలో ఉన్నారు.







ఏపీలోని పురుషోత్తపట్నంలో నిర్మిస్తున్న శ్రీగోకుల రామం , యటపాక గ్రామం

ఆ ఐదే అసలు సమస్య

- దక్షిణఅయోధ్యకు శరాఘాతంగా రాష్ట్ర విభజన
- భద్రాచలం మినహా మండలం మొత్తం ఏపీలో విలీనం
- ఆలయం తెలంగాణలో.. భూములు ఆంధ్రాలో
- పురుషోత్తపట్నంలో యథేచ్ఛగా రామయ్యభూముల ఆక్రమణ

భద్రాచలం, మార్చి 5: రాష్ట్ర విభజన సందర్భంగా ఏపీ పరిధిలోకి వెళ్లిన ఆ ఐదు పంచాయతీలు తెలంగాణలో విలీనం చేస్తేనే భద్రాచలానికి ఊపిరి పోసినట్లవుతుంది. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం సందర్భంగా ప్రత్యేక పరిస్థితుల్లో పోలవరం ముంపు పేరుతో ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ఏడు మండలాలు ఏపీ పరిధిలో విలీనం చేశారు. కూనవరం, చింతూరు, వరరామచంద్రాపురం, కుక్కునూరు, వేలేరుపాడు, బూర్గంపాడులోని పలు గ్రామాలతో పాటు భద్రాచలం మండలం (భద్రాచలం పంచాయతీ మినహా) ఏపీ పరిధిలో విలీనమయ్యాయి. దీంతో రాష్ట్రంలో నాడు జిల్లాగా ఆవిర్భవించాల్సిన భద్రాచలం పంచాయతీకే పరిమితమైంది. దీంతో పలు ప్రభుత్వ విద్యా సంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలు ఉమ్మడి జిల్లాలోని ఇతర ప్రాంతాలకు తరలివెళ్లాయి. యటపాక, గుండాల, పురుషోత్తపట్నం, పిచుకలపాడు, కన్నాయిగూడెం పంచాయతీలను తిరిగి భద్రాచలంలో విలీనం చేయాలని ఆ ప్రాంతవాసులతో పాటు భద్రాద్రివాసులు సైతం దశాబ్దకాలంగా కోరుతూనే ఉన్నారు. 2017 నవంబరులో అప్పటి సీఎం కేసీఆర్ ఐదు పంచాయతీలను తిరిగి తెలంగాణలోని భద్రాచలంలో విలీనం చేసేందుకు చర్యలు తీసుకుంటామని అసెంబ్లీ సాక్షిగాప్రకటించడంతో ఆశలు రేకెత్తాయి. దీంతో ఆ ఐదు పంచాయతీలు భద్రాద్రిలో విలీనమవుతాయని అందరూ భావించారు. కానీ నేటికీ అది ఆచరణకు నోచుకోకపోవడం శోచనీయం. భద్రాద్రిలో సేకరించే చెత్తను డంప్ చేసేందుకు యార్డు కూడా లేకపోవడంతో కరకట్టపైనే డంప్ చేస్తున్నారు.

ఆలయం ఇక్కడ.. భూములు అక్కడ

భద్రాద్రి రామాలయం తెలంగాణలో ఉండగా దేవస్థానానికి సంబంధించిన భూములు ఆంధ్రాలో ఉండిపోయాయి. భద్రాచలానికి కూతవేటుదూరంలో ఏపీ పరిధిలోని అల్లూరి జిల్లా యటపాక మండలం పురుషోత్తపట్నం గ్రామంలో భద్రాద్రి దేవస్థానానికి సంబంధించి 889.50 ఎకరాల భూమి ఉంది. ఇందులో 109 ఎకరాల్లో 2018లో శ్రీగోకుల రామం నిర్మాణం చేపట్టగా స్థానికుల నుంచి అవాంతరాలు ఎదురవుతున్నాయి. దేవస్థానం భూములు ఆక్రమణలకు గురవుతున్నా ఏపీ అధికారులు పట్టించుకోవడం లేదు. ఇదిలా ఉండగా గత ఏడాది దేవస్థానం వైదిక పరిపాలన ఉద్యోగులపై భౌతికదాడులు సైతం జరిగాయి. ఈ భూములు పూర్తిస్థాయిలో రామయ్యకు చెందాలంటే భద్రాద్రిలో పురుషోత్తపట్నం విలీనంతోనే సాధ్యమని భక్తులు అభిప్రాయపడుతున్నారు.

రవాణాకు సాంకేతిక సమస్యలు

భద్రాచలం నుంచి పర్ణశాల రామాలయానికి వెళ్లే మార్గంలో మేడువాయి నుంచి తూరుబాక వరకు ఎనిమిది కి.మీ. ఏపీ పరిధిలోనే ఉంటుంది. తూరుబాక బ్రిడ్జి దాటిన అనంతరం మళ్లీ తెలంగాణ పరిధి ప్రారంభమవుతుంది. దీంతో సాంకేతిక సమస్యలు తలెత్తుతున్నాయి. పర్ణశాల వెళ్లాలంటే ఏపీ పరిధిలోని ఎనిమిది కిలోమీటర్ల ప్రయాణం గుంతలతో అస్తవ్యస్తంగా, ప్రమాదకరంగా ఉంది. ఆ ప్రాంత ఇంజనీరింగ్ అధికారులు ఈ రహదారిపై దృష్టి సారించకపోవడంతో ఈ మార్గంలో వెళ్లేవారు తీవ్ర సమస్యలు ఎదుర్కొంటున్నారు.

రామాయణ ఇతివృత్తంతో ఉన్న ఆ రెండు గ్రామాలు

రామాయణం ఇతివృత్తంతో ముడిపడి ఉన్న ఉష్ణగుండాల, యటపాక గ్రామాలు ఏపీ పరిధిలోకి వెళ్లాయి. ఉష్ణగుండాలలో సీతమ్మవారు వేడి నీళ్లతో స్నానం చేసేందుకు ప్రత్యేక బావి ఉండేదని చారిత్రక ఆధారాల ద్వారా తెలుస్తోంది. అలాగే పర్ణశాల నుంచి సీతమ్మను రావణాసురుడు ఎత్తుకువెళ్లే సమయంలో పక్షిరాజు జటాయువు పోరాడగా అక్కడ ఒక రెక్క పడటంతో ఆ ప్రాంతానికి 'జటపాక' అనే పేరు వచ్చింది. కాల క్రమంలో ఆ జటపాకనే 'యటపాక'గా రూపాంతరం చెందింది. చారిత్రక ప్రాశస్త్యం కలిగిన ఈ రెండు గ్రామాలు ఏపీ పరిధిలోనే ఉండిపోయాయి.

జ్వరంతో మంచం పట్టిన కిష్టారం

సింగరేణి సీహెచ్‌పీనే కారణం అంటున్న గ్రామస్థులు

తాజాగా మెడికల్ క్యాంపులో 16మందికి జ్వరనిర్ధారణ

సత్తుపల్లిరూరల్, మార్చి7: మండలంలోని కిష్టారంలో పదుల సంఖ్యలో జ్వరం బారిన పడ్డారు. నెల రోజులలో వ్యవధిలో చాలామంది రోగులు చికిత్స పొందినట్లు గ్రామస్థులు చెబుతున్నారు. తాజాగా గురువారం గ్రామ పంచాయితీ అధ్వర్యంలో నిర్వహించిన మెడికల్ క్యాంపులో 94మందికి పరీక్షలు నిర్వహించగా వారిలో 16మందికి జ్వరం ఉన్నట్లుగా తేలినట్లు సెక్రటరీ మద్దెల రవి తెలిపారు. వీరిలో మారోజు వెంకటేష్, పాలకుర్తి కమలమ్మ, పాలకుర్తి అక్షయ్‌కుమార్, రామాల రాణి, పాలకుర్తి కమలమ్మలను 108ద్వారా సత్తుపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించామన్నారు.

సైలోబంకర్ కారణంగానే రోగాలు

సింగరేణి ప్రభావిత ప్రాంతమైన కిష్టారం గ్రామంలోని జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న సైలోబంకర్ (సీహెచ్‌పీ) ద్వారా బొగ్గు మసి లేచి సమీపంలోని అంబేద్కర్ నగర్‌పై పడటంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారని, పలువురు అనారోగ్యంతో పలు కారణాలతో మృత్యువాతకు గురైనట్లు గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. సీహెచ్‌పీని తొలగించాలంటూ గ్రామస్థులు పలు మార్లు ఆందోళన చేసినప్పటికీ కంటి తుడుపు చర్యలు మాత్రమే సింగరేణి సంస్థ చేస్తుందని వాపోతున్నారు.

కుటుంబంలో అందరికీ జ్వరాలే

కిష్టారంలో అంబేద్కర్ నగర్‌లో 735మంది జనాభా ఉండగా 320కుటుంబాలు ఉన్నాయి. ప్రతీ కుటుంబంలో ఒకరిద్దరు చొప్పున రెండు నెలల నుంచి జ్వరపీడితులు, శ్వాసకోశ వ్యాధులతో ఇబ్బందులు పడుతున్నారు. జ్వరంతో బాధ పడుతూ పాలకుర్తి నరసింహారావు, శ్రీదేవి, చిన్న కుమారుడు అవినయ్‌లు బుధవారం సత్తుపల్లి ప్రభుత్వ ఆసుపత్రి నుంచి డిశార్జ్ అవ్వగా వారి పెద్ద కుమారుడు అక్షయ్‌కుమార్, నరసింహారావు తల్లి కమలమ్మ, పిన్ని కమలమ్మ గురువారం తీవ్ర జ్వరంతో ఆసుపత్రిలో చేరారు. వీరిని ఇంటి నుంచి మంచంపై 108లో ద్వారా తరలించారని, కాలనీ 320కుటుంబాలలో ఇదే పరిస్థితి నెలకొందని బంధువులు చెబుతున్నారు.



జ్వరపీడితులను మంచంపై నుంచి అంబులెన్స్‌లో ఎక్కిస్తున్న అంబేద్కర్ నగర్ వాసులు



సీహెచ్‌పీ నుంచి గాలిలో కలుస్తున్న బొగ్గు మసి

పోలవరం ప్రాజెక్టు ముంపుపై సర్వే చేయాలి

• సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు మచ్చా



మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

భద్రాచలం, మార్చి7: పోలవరం ప్రాజెక్టు ముంపుపై నిపుణులతో కమిటీ వేసి నిర్దిష్టంగా సర్వే చేయాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు మచ్చా వెంకటేశ్వర్లు అన్నారు. భద్రాచలంలో గురువారం జరిగిన అఖిల పక్ష సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం భద్రాచలంను తీవ్రంగా నష్టపరిచిందన్నారు. పట్టణాభివృద్ధికి సమస్యల పరిష్కారానికి రాజకీయాలకు అతీతంగా కృషి చేద్దామని పిలుపునిచ్చారు. ఐదు పంచాయతీలను తెలంగాణలో కలిపేందుకు రాష్ట్ర ప్రభుత్వంచే చొరవ చూపాలని కోరారు. భద్రాచలం కేంద్రంగా ఉన్న ప్రభుత్వ ఆసుపత్రిలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయలని గోదావరి ముంపు నుంచి భద్రాచలంకు శాశ్వత ప్రాతిపదికన కరకట్ట నిర్మాణం చేపట్టాలన్నారు. పాండురంగాపురం నుంచి సారపాక వరకు రైల్వేలైను మంజూరుకు కేంద్రంపై ఒత్తిడి తేవాలని తదితర డిమాండ్లతో రౌండ్ టేబుల్ సమావేశం ఆమోదంచింది. గడ్డం స్వామి అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో బీఆర్‌ఎస్ నాయకులు అరికెల తిరుపతిరావు, సీపీఎం నాయకులు ఎంబి నర్సారెడ్డి, టీడీపీ నుంచి అబ్బినేని శ్రీనివాస్, మారెడ్డి శివాజీ, కొండా చరణ్, పూనెం వీరభద్రం, దాసరి శేఖర్, జిందా, బి.వెంకటరెడ్డి, ఎంవిఎస్ నారాయణ, బండారు శరత్‌బాబు, ఎన్.నాగరాజు పాల్గొన్నారు.

తాగునీటి సరఫరాపై షెడ్యూల్ తయారు చేయండి



సమీక్ష నిర్వహిస్తున్న నగరపాలకసంస్థ కమిషనర్ ఆదర్శ్‌సురభి

ఖమ్మం కార్పొరేషన్, మార్చి7: డివిజనవారీగా తాగునీటి సరఫరాపై షెడ్యూల్ తయారు చేసి, ఆ ప్రకారమే తాగునీటిని పంపిణీ చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఆదర్శ్‌సురభి ఆదేశించారు. గురువారం కమిషనర్ దానవాయిగూడెం ఫిల్టర్‌బెడ్ వద్ద తాగునీటి సరఫరాపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు లైన్‌మన్‌లు తనకు సమాచారం ఇవ్వకుండా తాగునీటి సరఫరా తమ ఇష్టానుసారం చెయ్యవద్దన్నారు. డివిజన్లలో తాగునీటి సరఫరాలో సమస్యలు ఉన్నాయా? అని నగరపాలక సంస్థ ఎస్‌ఈ రంజిత్‌కుమార్, ఈఈ కృష్ణాలాల్‌ను కమిషనర్ అడిగి తెలుసుకున్నారు. డివిజన్లలోని హ్యాండ్‌బోర్లను, పవర్‌బోర్లను మరమ్మతులు చేసి, వాటిని వాడుకలోకి తేవాలన్నారు. నగరంలోని రమణగుట్ట, కేసీఆర్ టవర్స్, వైఎస్సార్ నగర్, ఎల్బీనగర్ తదితర ప్రాంతాల్లో తాగునీటి సమస్య ఉండే అవకాశం ఉందని అధికారులు ఆయా ప్రాంతాల్లో ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దానవాయిగూడెం ఫిల్టర్‌బెడ్ వద్ద ప్రతిరోజు ఒక డీఈ, ఏఈ వంతులవారీగా పర్యవేక్షణ చేయాలని, వారి సమక్షంలోనే డివిజన్లకు తాగునీరు సరఫరా చేయాలని కమిషనర్ పేర్కొన్నారు. ఈ సమీక్షా సమావేశంలో ఎస్‌ఈ, ఈఈ,డీఈలు, ఏఈలు, వర్క్‌ఇన్స్‌పెక్టర్లు, లైన్‌మన్‌లు, పంపు ఆపరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

సమయం పాటించని డీలర్లపై చర్యలు తీసుకోవాలి

కల్లూరు, మార్చి7: సమయం పాటించని డీలర్లపై తగిన చర్యలు తీసుకోవాలని ఎంపీటీసీ కొండూరి కిరణ్ కుమార్ కోరారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పలు శాఖల కార్యక్రమాలపై ఎంపీపీ బీరవల్లి రఘు అధ్యక్షతన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆర్డీవో కే.శ్రీనివాస్ పాల్గొన్నారు. పలు గ్రామాల్లో ప్రభుత్వం నిర్ధేశించిన విధంగా పనివేళలు పాటించటంలేదని, దీంతో కూలీ పనులకు వెళ్లే పేదలకు సరియైన సమయంలో బియ్యం అందటం లేదని సభ్యులు ప్రస్తావించారు. విద్యుత్ జీరో బిల్లులు రాని వారు మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 15 వ తేదీ లోగా దరఖాస్తులు చేసుకోవాలని ఏఈ గణేష్ లబ్ధిదారులకు సూచించారు. ఎంపీడీవో చంద్రశేఖర్ మాట్లాడుతూ మండలంలో తాగునీటి సమస్య తలెత్తకుండా అన్ని రకాల చర్యలు తీసుకుంటుమన్నారు. ఈ సమావేశంలో పశువైద్యాధికారి కే మమత, ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు నవ్యకాంత్, నస్రత్ తబస్సుం, ఎసిడిపివో రత్తమ్మ, తహసీల్దార్ సాంబశివుడు, కోఆప్షన్ సభ్యులు ఇస్మాయిల్, కమ్లి, ఎంపీటీసీలు మాదిరాజు లక్ష్మణరావు, గోపిరెడ్డి పాల్గొన్నారు.

వేతన జీవుల ఆకాంక్షలు నెరవేర్చాలి

కొత్తగూడెం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): వేతన జీవుల ఆకాంక్షలు నెరవేర్చాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి నరాటి ప్రసాద్ అన్నారు. గురువారం కలెక్టర్ కార్యాలయం ఎదుట నేషనల్ మిషన్ ఎన్‌హెచ్‌ఎంలో పని చేస్తున్న ఆల్‌క్యాడర్స్ ఉద్యోగులకు మూడు నెలలుగా వేతనాలు రావడం లేదని మహిళా ఉద్యోగులు, 2 ఎఎన్‌ఎంలు డాక్టర్స్ స్టాఫ్‌నర్సు, ఫార్మసిస్టర్స్ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులకు 3 నెలలుగా వేతనాలు రాకుండ ఉండటం వల్ల కుటుంబాలు ఆకలితో అలమటిస్తు ఆడ పిల్లల రోధనలతో ఆర్థిక ఒత్తిడితో సతమతమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం డీఎంహెచ్‌వో శిరీషకు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు అరుణకుమారి, ఉమాదేవి, అనూష, శిరీష, సౌమ్య, మానస, స్రవంతి, ప్రియాంక, పార్వతి, అరుణ, బాలనాగమ్మ, రాములమ్మ, కౌసల్య, జ్యోతి, పద్మజ, మనోజ్, వినయ్, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భవనంపై నుంచి పడి హమాలి మృతి

ఖమ్మంక్రైం, మార్చి7: భవనంపై నుంచి ప్రమాదవశాత్తు పడి ఓ హమాలి మృతి చెందిన సంఘటన బుధవారం ఖమ్మం నగరంలో జరిగింది. త్రీటౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నేలకొండపల్లి మండలం మోటాపురానికి చెందిన గుగులోత్ వీరు (40) వ్యవసాయ మార్కెట్‌లో మిర్చి హమాలీగా పనిచేస్తున్నాడు. మృతుడి భార్య, పిల్లలు వైరా మండలం గొల్లపుడిలో ఉంటుండంతో వారి వద్దనే ఉంటూ, ప్రతిరోజు మార్కెట్‌కు వచ్చి పనులు ముగించుకుని వెళ్తున్నాడు. అయితే మిర్చి సీజన్ కావడంతో బుధవారం అర్ధరాత్రి వరకు లారీలకు లోడింగ్ చేశాడు. తనకు తెలిసిన జగదీష్ వ్యక్తి నగరంలో గాంధీనగర్‌లో ఉండడంతో అతని ఇంటికి వెళ్లాడు. కుటుంబ సభ్యులతో కలిసి భవనంపైనే నిద్రించాడు. తెల్లవారు జామున సుమారు 3గంటల సమయంలో ప్రమాదవశాత్తు భవనంపై నుంచి కింద పడిపోయాడు. దీంతో కింద ఉంటున్న మరో కుటుంబం చూసి కేకలు వేయడంతో జగదీష్ కుటుంబ సభ్యులు వచ్చి 108 ద్వారా అతడిని ఆసుపత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. త్రీటౌన్ పోలీసులు సంఘటన స్థలం వద్దకు చేరుకుని వివరాలు సేకరించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కుటుంబ కలహాలతో భర్త ఆత్మహత్య

ముదిగొండ, మార్చి 7: కుటుంబ కలహాలతో భర్త ఆత్మహత్య చేసుకున్న సంఘటన ముదిగొండ మండలం ధనియాలగూడెం గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఆవుల ఉపేందర్(35) 15ఏళ్ల క్రితం జీవితతో వివాహమైంది. వీరికి ఇద్దరు ఆడపిల్లలున్నారు. నాలుగు సంవత్సరాల నుంచి మనస్పర్థలు ఏర్పడి ఇద్దరు తరచూ గొడవపడుతుండేవారు. ఈనెల 4న భర్తతో గొడవ పడి జీవిత పుట్టింటికి వెళ్లింది. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన ఉపేందర్ గురువారం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకున్నాడు. చుట్టు ఎక్కల వారు గమనించి 108వాహనం ద్వారా ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడి తల్లి పద్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నరేష్ తెలిపారు.

ఉరేసుకుని రౌడిషీటర్....

అశ్వారావుపేట రూరల్: ఉరివేసుకుని రౌడిషీటర్ ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని పేరాయిగూడెం మోడల్ కాలనీలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పేరాయిగూడెం పంచాయతీ మోడల్ కాలనీకి ఎస్‌కే మస్తాన్(34) కారు డ్రైవర్‌గా జీవినం సాగిస్తూ కొంతకాలంగా సత్తుపల్లిలో ఉంటున్నారు. కొద్దిరోజుల క్రితం మద్యం మత్తులో పొరుగువారితో గొడవ జరగ్గా తిరిగి మోడల్ కాలనీకి వచ్చాడు. అక్కడే తన స్నేహితుడు జాఫర్ ఇంట్లో ఉంటున్నాడు. గురువారం స్నేహితుడి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమాచారం అందుకున్న ఎస్ఐ శ్రీను సంఘటన స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు. ప్రస్తుతం కుటుంబసభ్యులు అంతా హైదరాబాదులో నివాసం ఉంటున్నారు. అయితే గతంలో మృతుడు ఓమహిళను హత్య చేసిన కేసులో నిందితుడగా ఉండగా, స్థానిక పోలీస్‌స్టేషన్‌లో రౌడిషీట్ నమోదై ఉంది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

రేగులచెలకలో తాగునీటి వివాదం

రఘునాథపాలెం, మార్చి7: ఒక వైపు తాగునీటి ఎద్దడితో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతుంటే రఘునాథపాలెం మండలంలోని రేగులచెలక గ్రామంలో గ్రామ పంచాయతీ తాగునీటి బోరును ఓ వ్యక్తి సొంత నీటి అవసరాలకు వాడుకుంటున్నారని రెండు రోజులుగా వివాదం జరుగుతోంది. గురువారం తాగునీటి సమస్యపై జరిగిన గ్రామసభలోను తాగునీటి బోరుపై వివాదం చోటు చేసుకొంది. ఈ విషయం పై గ్రామ పంచాయతీ కార్యదర్శి సంగీతను వివరణ కొరగా తాగునీటి బోరుపై గ్రామసభలో చర్చ జరిగిందని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి ప్రజా ప్రయోజనార్థం చర్యలు తీసుకుంటారని వివరించారు.

నాయనమ్మను హత్య చేసిన మనుమడు



కమలమ్మ మృతదేహం

ముదిగొండ, మార్చి 7: మతిస్థిమితం కోల్పోయిన ఓ వ్యక్తి తన నాయనమ్మను రోకలిబండతో మోది హత్య చేసిన సంఘటన బుధవారం అర్ధరాత్రి ఖమ్మం జిల్లా ముదిగొండ మండలం అమ్మపేట గ్రామంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... అమ్మపేట గ్రామానికి చెందిన చాగంటి కమలమ్మ(80)తో కలిసి మనమడు చాగంటి రామకృష్ణ ఒకే ఇంట్లో ఉంటున్నారు. రామకృష్ణ చెడువ్యసనాలకు బానిసై మతిస్థిమితం లేకుండా ఉంటున్నాడు. సరిగా ఉండాలని కమలమ్మ మందలించడంతో రామకృష్ణ కమలమ్మను రోకలిబండతో మోది హత్య చేశాడు. గమనించిన స్థానికులు రామకృష్ణను పట్టుకొని పోలీసులకు అప్పగించారు. మృతురాలు కుమార్తె చిన్నఉప్పెర్ల లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నరేష్ తెలిపారు.

మోదీ ప్రభుత్వంలో మహిళలకు రక్షణ కరువు: శిరోమణి



మాట్లాడుతున్న పీవోడబ్ల్యూ రాష్ట్ర కార్యదర్శి శిరోమణి

ఖమ్మం సంక్షేమవిభాగం, మార్చి 7: మనువాదాన్ని, మతోన్మాదాన్ని మరింతగా బలోపేతం చేస్తున్న మోదీ ప్రభుత్వం దేశంలో మహిళలకు కనీస రక్షణ చర్యలు తీసుకోవడంలో విఫలం చెందిందని పీవోడబ్ల్యూ రాష్ట్ర కార్యదర్శి చల్లగుండ్ల శిరోమణి ఆరోపించారు. గురువారం రామనర్సయ్య విజ్ఞాన కేందంలో గోకినపల్లి అనిత అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. అంతర్జాతీయ 50వ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలపై జరుగుతున్న దాడులు, అఘాయిత్యాలపై ఈనెల 8నుంచి 31వరకు రాష్ట్ర వ్యాప్తంగా సభలు, సమావేశాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రజల్లో ఉన్న విశ్వాసాలను ఆసరా చేసుకొని బీజేపీ ప్రభుత్వం వంచన చేస్తుందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఆవుల మంగతాయి, ఝాన్సీ, శోభా పాల్గొన్నారు.

రూ.మూడు లక్షల విలువైన పుస్తకాల వితరణ

మధిరటౌన్,మార్చి6: మధిర ప్రభుత్వ గ్రంథాలయానికి సుమారు రూ.మూడు లక్షలు విలువ చేసే పుస్తకాలను హైదరాబాద్‌కు చెందిన డా. ఆర్. శివరామకృష్ణ ప్రసాద్, మధిర ఆంధ్రజ్యోతి రిపోర్టర్ కొంగర మురళి, హైదరాబాద్ వీఎస్‌ఆర్ కాలేజీ లైబ్రేరియన్ మచ్చా ఫణికుమార్ ద్వారా వితరణ చేశారు. గురువారం మధిర గ్రంథాలయంలో జరిగిన కార్యక్రమంలో లైబ్రేరియన్ నాగలక్ష్మికి వారు పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా లైబ్రేరియన్ నాగలక్ష్మి మాట్లాడుతూ ఇవి చాలా విలువైన పుస్తకాలని నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఎన్‌సైక్లోపెడియా 24 ఎడిషన్ లతో పాటు ఎంతో విలువైన డిక్షనరీలు, ఇంగ్లీష్ నవలలు ఇందులో ఉన్నాయని అన్నారు. కార్యక్రమంలో టివిఎం పాఠశాల పూర్వ విద్యార్థి సంఘం అధ్యక్ష, కార్యదర్శులు పుతుంబాక కృష్ణప్రసాద్, మాదవరపు నాగేశ్వరరావు, స్థానిక కౌన్సిలర్ కోనా ధనికుమార్, మునుగోటి వెంకటేశ్వర్లు, మార్నీడి దిలీప్ కుమార్, కోనా జగదీష్ తదితరులు పాల్గొన్నారు.



లైబ్రేరియన్‌కు పుస్తకాలు అందచేస్తున్న దాతలు

సుప్రీం కోర్టు తీర్పును అమలు చేయని బ్యాంకులు

● ఖమ్మంలో ఓ బ్యాంకు ఎదుట కాంగ్రెస్ నాయకుల నిరసన



ధర్నా చేస్తున్న కాంగ్రెస్ నాయకులు,

ఖమ్మం సంక్షేమవిభాగం, మార్చి 7: రాజ్యాంగబద్ధంగా ఏర్పాటైన సుప్రీంకోర్టు తీర్పులను కార్పొరేట్ బ్యాంకులు అమలు చేయటం లేదని జిల్లా, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, ఎండీ జావీద్, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య ఆరోపించారు. టీపీసీసీ పిలుపు మేరకు గురువారం ఖమ్మంలోఓ బ్యాంకు కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఓ కార్పొరేట్ బ్యాంకు బీజేపీకి అనుకూలంగా వ్యవహరిస్తుందని ఆరోపించారు. కార్పొరేటర్లు రఫీదాబేగం, పల్లెబోయిన భారతిచంద్రం, నగర కార్యనిర్వాహక అధ్యక్షులు నాగండ్ల దీపక్‌చౌదరి, జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు యడ్లపల్లి సంతోష్, సాధు రమేశ్‌రెడ్డి, మెక్కా శేఖర్‌గౌడ్, భూక్యా బాలాజీనాయక్, మిక్కిలినేని నరేంద్ర తదితరులున్నారు.

మధిరటౌన్: ఎలక్టోరల్ బాండ్‌ల వివరాలను తెలిపేందుకు ఎస్‌బీఐ బ్యాంక్ అధికారులు చేస్తున్న తాత్సారానికి నిరసనగా మధిర గురువారం మధిర ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచ్ ముందు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు నిరసన వ్యక్తం చేశారు.

బోనకల్: బోనకల్ ఎస్‌బీఐ ఎదుట కాంగ్రెస్ పార్టీ నాయకులు జెండాలతో నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు గాలి దుర్గారావు , పీసీసీ సభ్యుడు పైడిపల్లి కిషోర్ కుమార్, వైస్ ఎంపీపీ గుగులోతు రమేష్, మరీదు శ్రీనివాసరావు, పాస కోటేశ్వరావు, గంగాదర్, శ్రీను పాల్గొన్నారు.

భద్రాచలం నుంచి లహరి బస్సులు ప్రారంభం

భద్రాచలం, మార్చి 7: భద్రాచలం డిపో నుంచి లహరి సీట్ కం స్లీపర్ నాన్ ఏసీ అధునాతన హంగులతో కూడిన బస్సులు గురువారం ప్రారంభమయ్యాయి. భద్రాచలం నుంచి ఉదయం 9 గంటలకు, రాత్రి 10 గంటలకు బయలుదేరి బీహెచ్‌ఈఎల్‌కు చేరుకుంటాయని డిపో మేనేజరు వి.రామారావు తెలిపారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని భద్రాచలం తెలిపారు.

అడిషనల్ డీసీపీగా ప్రసాదరావు

ఖమ్మంక్రైం, మార్చి7: అడిషనల్ డీసీపీ లా అండ్ ఆర్డర్‌గా జి.ప్రసాదరావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం సీపీ కార్యాలయంలో పోలీసు కమిషనర్ సునిల్ దత్‌ను మర్యాద పూర్వకంగా కలిసి మొక్కను అందించారు. ఇటీవల బదిలీల్లో భాగంగా రాచకొండ కమిషనరేట్ పరిధిలోని ఎల్‌బీనగర్ ఎస్‌వోటీ అడిషనల్ డీసీపీగా పనిచేస్తున్న ఆయనను ఖమ్మం కమిషనరేట్‌కు బదిలీ చేశారు.



సీపీ సునిల్‌దత్‌కు మొక్క అందిస్తున్న ప్రసాదరావు

ఖమ్మం ఎఫ్‌డీవోగా తిరిగి ప్రకాశ్‌రావు...

ఖమ్మం సంక్షేమవిభాగం, మార్చి 7: ఖమ్మం ఎఫ్‌డీవోగా పనిచేసిన ప్రకాశ్‌రావుకు ఏప్రిల్ 2023లో బదిలీ జరిగింది. అయితే ఏడాదిలోపు(2024ఏప్రిల్)గా పదవి విరమణ ఉన్న తనను ఏలా బదిలీ చేస్తారని సెలవుపై వెళ్లి శాఖ పరంగా తన పోరాటం చేసిన ప్రకాశ్‌రావు తిరిగి గురువారం ఖమ్మం ఎఫ్‌డీవోగా బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ బాధ్యతలు నిర్వహిస్తున్న బాబురావు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వన్యప్రాణి సంరక్షణ అధికారిగా బదిలీపై వెళ్లారు.

రూ.లక్ష విరాళం అందజేత

ఖమ్మం ఖానాపురంహవేలి మార్చి 7: కార్పొరేషన్ పరిధిలోని 1వ డివిజన్ కైకొండాయిగుడెం ప్రధాన రహదారి వెంట కొలువై ఉన్న విశాలాక్షి సమేత కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయంలో మహాశివరాత్రి పర్వదినాన నిర్వహించనున్న మహా అన్నదానానికి ఖమ్మం నగరానికి చెందిన దేవభక్తిని కిషోర్, విజయ దంపతులు రూ.లక్ష విరాళంగా అందించారు. అంకమ్మ, మహాలక్ష్మమ్మ, మద్దిరావమ్మ ఆలయ నిర్మాణానికి గురువారం ఖమ్మం నగరానికి చెందిన బందం కొండయ్య, నాగలక్ష్మి దంపతులు రు. 20,116లు, భవాని మెస్ యజమాని బండపెల్లి వెంకటేశ్వర్లు, భాగ్యలక్ష్మి దంపతులు రు. 10,116లు విరాళంగా ఆలయ కమిటీకి అందించారు.

సరిహద్దున ఇసుక దందా

» ఆంధ్రా నుంచి యథేచ్ఛగా అక్రమ రవాణా

» ప్రతి రోజూ లారీల్లో భారీగా సత్తుపల్లికి తరలింపు

» పట్టించుకోని అధికార యంత్రాంగం



సత్తుపల్లిలో గుట్టలుగా గోదావరి ఇసుక

సత్తుపల్లి, మార్చి7: ఇసుక అక్రమ రవాణా కొందరికి కాసులు కురిపిస్తోంది. నిబంధనలకు విరుద్ధంగా ఏ రకమైన అనుమతులు లేకుండా ఇసుక అక్రమ రవాణా ద్వారా రూ.లక్షల వ్యాపారం సాగుతోంది. సత్తుపల్లికి చెందిన కొందరు ఆంధ్రప్రదేశ్ నుంచి ఇసుకను సత్తుపల్లి పరిసర మండలాలకు తరలించి వ్యాపారం కొనసాగిస్తున్నారని సమాచారం. తెలంగాణలో అధికారిక ఇసుక క్వారీల నుంచి గతంలో తెప్పించిన ఇసుకను అవసరమైన వారికి విక్రయించి ప్రస్తుతం ఆంధ్రా నుంచి తెచ్చిన ఇసుకను సత్తుపల్లిలో డంప్ చేసి విక్రయిస్తున్నారు. ఎవరైనా ప్రశ్నిస్తే గతంలో రవాణా బిల్లులను చూపుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లోని రాజమండ్రి ప్రాంతం నుంచి కొందరు లారీలలో అక్రమంగా ఇసుకను సరిహద్దులు దాటించి రెండు రాష్ట్రాల నుంచి సరిహద్దుల్లోని సత్తుపల్లి, వేంసూరు మండలాలలో విక్రయిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. నెలల తరబడి ఆంధ్రా నుంచి ఇసుక అక్రమంగా రాష్ట్రంలోకి ప్రవేశిస్తున్న సత్తుపల్లిలో పట్టించుకునే అధికారులే కరువయ్యారు. దీని వెనుక పెద్ద మొత్తంలో లావాదేవీలు సాగుతున్నాయని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో గత నెలలో 17ఇసుక లారీలను అధికారులు పట్టుకున్న అనంతరం ఆ ప్రాంతం నుంచి సత్తుపల్లి వైపు వచ్చే ఇసుక రవాణా కొంతమేర నిలిచిపోయినా ఆంధ్రాలోని ఇతర ప్రాంతాల నుంచి సత్తుపల్లి పరిసర మండలాలకు భారీగా అక్రమ రవాణా సాగుతుంది. ఇసుక అక్రమ రవాణాపై నిఘా వర్గాలు ఇప్పటికే ప్రభుత్వానికి నివేదిక పంపినట్లు తెలిసింది. సగటున రోజుకు 10లారీలు ఇసుక సత్తుపల్లి ప్రాంతానికి వస్తున్నట్లు ప్రభుత్వానికి సమాచారం అందింది. గతంలో టన్ను రూ.800నుంచి 900వరకు పలికిన ఇసుక ధరను ఇప్పుడు వ్యాపారులు మరింత పెంచి విక్రయిస్తున్నారని చెబుతున్నారు.

ఈ ప్రాంతంలో భవనాల నిర్మాణం వేగం పుంజుకోవడంతో ఇసుక అవసరం రెట్టింపు అయింది. దీనిని ఆసరా తీసుకున్న అక్రమ వ్యాపారులు తమ వ్యాపార సామ్రాజ్యాన్ని రోజురోజుకు విస్తరించుకుంటున్నారు.

అధికారులపై మంత్రి పొంగులేటి ఆగ్రహం

ఆంధ్రప్రదేశ్ నుంచి ఇసుక అక్రమ రవాణా జరుగుతుంటే అధికారులు ఏమి చేస్తున్నారంటూ రెండు రోజుల క్రితం సత్తుపల్లిలో జరిగిన సమీక్షా సమావేశంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మైనింగ్ అధికారులను గట్టిగా నిలదీశారు. సరిహద్దుల నుంచి వచ్చే ఇసుక ఎక్కడికి వస్తుంది, ఎటు పోతుంది, ఎంత వస్తుంది అనే సమాచారం మీ వద్ద ఉందా, ఉంటే ఏమి చర్యలు తీసుకుంటున్నారు, నియంత్రిస్తున్నారా అంటూ అధికారులపై ప్రశ్నల వర్షం కురిపించారు. అసలు ఆంధ్రా నుంచి ఇసుక వస్తుందనే సమాచారం మీకు ఉందా అని నిలదీశారు. దీనికి మైనింగ్ అధికారులు సమాధానం ఇస్తూ ఆంధ్రా నుంచి ఇసుక వస్తుందని, దాడులు చేస్తున్నామని చెప్పడంతో... ఎక్కడ దాడులు చేశారు.

ఎన్ని కేసులు పెట్టారని మంత్రి ప్రశ్నించడంతో అధికారులు సమాచారం చెప్పలేకపోయారు. దీనిపై పొంగులేటి మాట్లాడుతూ ఏసీపీ, ఇతర పోలీసు అధికారుల సహకారంతో ఇసుక అక్రమ రవాణాను పూర్తిగా నియంత్రించాలని ఆదేశిస్తూ మైనింగ్ అధికారులు తనను కలవాలంటూ ఆదేశించారు.

ప్రభుత్వ ఆస్పత్రిలో అరుదైన ఆపరేషన్

● క్యాథ్‌ల్యాబ్ ద్వారా వైద్యం అందించిన జిల్లా ప్రభుత్వ వైద్యాధికారులు



నవీన్‌ను పరిశీలిస్తున్న వైద్య బృందం

ఖమ్మం కలెక్టరేట్, మార్చి7: క్యాథ్‌ల్యాబ్ ద్వారా ప్రాణాపాయస్థితిలో ఆస్పత్రిలో చేరిన ఓ రోగికి స్టెంట్లు వేసి ఆ యువకుడి ప్రాణాలు కాపాడారు మన ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులు. ఆంధ్రప్రదేశ్‌రాష్ట్రం వత్సవాయి మండలం దాచేపల్లికి చెందిన జె. నవీన్ అనే 23 ఏళ్ల యువకుడు లారీక్లీనర్‌గా పని చేస్తున్నాడు. సోమవారం ఛాతీలో తీవ్రమైన నొప్పి, శ్వాసతీసుకోవడానికి కూడా ఇబ్బంది పడుతున్న తరుణంలో ఖమ్మంలో ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లారు. అక్కడ గుండెకు పరీక్షలు నిర్వహించారు. ఎంజీయోగ్రామ్ చేశారు. గుండెకు రక్తాన్ని తీసుకెళ్లే నాళాలు మూసుకుపోయాయని గుర్తించారు. దీంతో స్టెంట్లు వేయాలని వైద్యులు చెప్పారు. దాదాపు రూ.రెండున్నర లక్షలు అవుతాయని చెప్పడంతో బాధితులు దిక్కుతోచని స్థితిలో ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రిలో చేరారు. చిన్నవయస్సులోనే ఇంత పెద్ద కష్టం రావడంతో నవీన్ తరపు బంధువులు సోదరి తీవ్రంగా ఆందోళన చెందారు. ఆంధ్రాకు చెందిన వ్యక్తి కావడంతో ఆరోగ్యశ్రీ సేవలు కూడా అందించలేని పరిస్థితి. ఈ నేపథ్యంలో జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎల్. కిరణ్‌కుమార్, ఆర్‌ఎంవో అమర్‌సింగ్, డాక్టర్ సీతారాంలు మానవతా దృక్పథంతో ఆలోచించి ఆ యువకుడికి స్టెంట్ వేయాలని నిర్ణయించారు. క్యాథ్‌ల్యాబ్ ద్వారా ఎంతో టెక్నికల్‌గా చాకచక్యంగా ఆ యువకుడికి పూర్తి ఉచితంగా స్టెంటు వేశారు. ఫలితంగా ఆయువకుడు ప్రాణాపాయ స్థితి నుంచి బయటపడ్డాడు. గత మూడు రోజులుగా చికిత్స పొందుతూ పూర్తిగా కోలుకున్నాడు. గురువారం ఆయువకుడికి మరో మారు వైద్య పరీక్షలు నిర్వహించి డిస్చార్జి చేసినట్లు తెలిపారు. ఒక్క రూపాయి ఖర్చు కాకుండా మా సోదరుడి ప్రాణాలు నిలబెట్టారంటూ ఆ యువకుడి అక్క నాగమణి ఆనందభాష్పాలతో వివరించింది. ప్రాణాలు కాపాడిన గుండె వైద్య నిపుణులు డాక్టర్ సీతారాం, సూపరిన్‌టెండెంట్ డాక్టర్ ఎల్ కిరణ్‌కుమార్‌ను, క్యాథ్‌ల్యాబ్ టెక్నీషియన్లను పలువురు అభినందించారు.

నిరుపేదలకు సైతం కార్పొరేట్ వైద్యాన్ని, ఖరీదైన వైద్యచికిత్సలు అందిస్తూ అందరి ప్రశంసలు పొందుతున్నారు. రాష్ట్ర రాజధాని తర్వాత ఖమ్మంలోనే ప్రారంభమైన క్యాథ్‌ల్యాబ్ ద్వారా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయి. రెండేళ్ల క్రితం ఖమ్మం జిల్లా జనరల్ ఆస్పత్రిలో రూ.7కోట్ల వ్యయంతో క్యాథ్‌ల్యాబ్‌ను ప్రభుత్వంప్రారంభించి గుండె సంబంధిత వైద్యాన్ని అందుబాటులోకి తీసుకొచ్చింది.. ఇప్పటి వరకు హైదరాబాద్‌లోనే కార్పొరేట్ వైద్యశాలల్లో ఉండే గుండె సంబంధిత వ్యాధులను నిర్ధారించే 'కాథ్‌లాబ్' ను ఖమ్మం ఆస్పత్రిలో ఏర్పాటు చేశారు.

దొంగ నోట్లతో ఏమార్చి..

● పెట్రోల్ కొట్టించుకొని ఉడాయించిన వాహనదారుడు

సత్తుపల్లి రూరల్, మార్చి 7: ఓ పెట్రోల్ బంక్ లో దొంగ నోట్లు ఇచ్చి ఆయిల్ కొట్టించుకున్న అనంతరం వాహనంతో సహా ఉడాయించిన సంఘటన సత్తుపల్లి మండలం కిష్టారం గ్రామంలో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. సత్తుపల్లి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలోని హెచ్‌పీ పెట్రోల్ బంకు వద్ద ఓ వ్యక్తి ఒకరు వచ్చి రూ.5వేలకు డిజిల్ కొట్టమని కారుతో వచ్చాడు. రూ.5 వేలకు గానూ రూ.10చొప్పున రూ.500 దొంగ నోట్లను ఆయిల్ కొట్టిన తర్వాత ఇవ్వగా, బంకు సిబ్బంది తేలికగా అనిపించిన నోట్లను పట్టుకొని వాహనదారుడిని ప్రశ్నించగా సదరు వ్యక్తి కారుతో సహా సత్తుపల్లి వైపునకు పరారయ్యాడు. ఈవిషయమై సత్తుపల్లి పోలీసులకు బాధితుడు ఫిర్యాదు చేశాడు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

మధిరరూరల్, మార్చి 7: పొలంలో విద్యుత్ తీగెలు తగిలి పాడి గేదె మృతి చెందిన సంఘటన గురువారం మధిర మండలం జాలిముడి గ్రామంలో జరిగింది. కారుమంచి రవికి చెందిన పాడిగేదె జాలిముడి శివారు పొలాల్లో మేత మేస్తుండగా విద్యుత్ తీగెలు తగిలి గేదె మృతి చెందింది. మృతిచెందిన గేదె విలువ రూ.70వేలు ఉంటుందని రైతు తెలిపాడు.

అక్షర చిట్‌ఫండ్ కంపెనీపై ఫిర్యాదు

ఖమ్మం క్రైం, మార్చి 7: అక్షర చిట్‌ఫండ్ కంపెనీ వారు డిపాజిట్ చేస్తే వడ్డీ ఇస్తామని చెప్పి మోసం చేశారని ఓ వ్యక్తి ఫిర్యాదు చేయడంతో ఖమ్మం త్రీటౌన్ పోలీస్‌స్టేషన్ నందు గురువారం కేసు నమోదైంది. పట్టణంలోని పంపింగ్‌వెల్ రోడ్డులో నివాసం ఉంటున్న సర్వదేవభక్తుల ప్రవీణ్‌కుమార్ అను వ్యాపారి 2020 సంవత్సరంలో గాంధీచౌక్‌లోని అక్షర చిట్‌ఫండ్ కంపెనీ వారి మాటలు నమ్మి వారి బ్రాంచ్ నందు రూ.మూడు లక్షల నగదును డిపాజిట్ చేశాడు. కొద్ది రోజులపాటు కంపెనీ వారు ప్రవీణ్‌కుమార్‌కు వడ్డీ కూడా చెల్లించారు. తరువాత వడ్డీ కానీ, అసలు కాని చెల్లించకుండా ఇబ్బందులు పెడుతుండటంతో బాధితుడు త్రీటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

బీఆర్‌ఎస్ నాయకుల పరామర్శ



ములాఖత్‌లో బీఆర్‌ఎస్ నాయకులను కలిసి వస్తున్న నామా, పువ్వాడ


ఖమ్మంకార్పొరేషన్, మార్చి7: ఖమ్మం జిల్లా జైలులో ఉన్న బీఆర్‌ఎస్ నాయకులను బీఆర్‌ఎస్ లోక్‌సభా పక్షనేత, ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావు, మాజీమంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ గురువారం ములాఖత్ సమయంలో కలసి పరామర్శించారు. వివిధ కేసుల్లో రిమాండ్‌లో ఉన్న బీఆర్‌ఎస్ యువజన విభాగం నగర అధ్యక్షుడు దేవభక్తుని కిషోర్‌బాబు, మాజీ సర్పంచ్ ప్రదీప్, యువజన నాయకులు వీరేందర్, సందీప్, విజేత, రామ్‌లను నామా, పువ్వాడ పరామర్శించారు.

ప్రజా ప్రతినిధులకు సన్మానం

మధిరరూరల్, మార్చి 7: మధిర మండలం ఖమ్మంపాడు మాజీ ప్రజాప్రతినిధులకు గురువారం డీసీసీబీ చైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ప్రజాప్రతినిధులను సన్మానించడం ఆనందంగా ఉందని అన్నారు. ఈకార్యక్రమంలో ఎంపీడీవో వెంకటేశ్వర్లు, ఎంపీవో శాస్త్రీ, స్పెషలాఫీసర్ ప్రభాకర్, మాజీ ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.



మాజీ సర్పంచ్ జంగాల నాగేశ్వరరావును సన్మానిస్తున్న డీసీసీబీ ఛైర్మన్ వెంకటేశ్వరరావు



మహాశివరాత్రికి ముస్తాబైన ఆలయాలు

శివరాత్రి మహాపర్వదినం సందర్భంగా ఉమ్మడి జిల్లాలోని ప్రముఖ శివాలయాలను సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. భక్తుల కోసం సకల సదుపాయాలు కల్పించారు. ఖమ్మం జిల్లాలోని ప్రముఖ ఆలయమైన కూసుమంచి గణపేశ్వరాలయం, తీర్థాల సంగమేశ్వర ఆలయం, వైరా స్నానాలలక్ష్మీపురంలోని శ్రీరామలింగేశ్వర స్వామి ఆలయం, పెనుబల్లిలోని నీలాద్రీశ్వర ఆలయం, కారేపల్లిలోని కోటిలింగాల ఆలయం, నగరంలోని ప్రసిద్ధ పురాతనమైన గుంటుమల్లేశ్వరస్వామి ఆలయం, సుగ్గల వారి తోట శివాలయం, బ్రాహ్మణ బజార్‌లోని శివాలయం, ధంసలాపురం శివాలయం, తదితర ఆలయాలను సుందరంగా అలంకరించారు. అదేవిధంగా భద్రాద్రి జిల్లా బూర్గంపాడు మండలంలోని మోతేగడ్డ వీరభద్రస్వామి ఆలయం శివకల్యాణానికి ముస్తాబైంది. శుక్రవారం తెల్లవారు జామునుంచే ప్రత్యేక పూజలు, అభిషేకాలు, కుంకుమ పూజలు నిర్వహించటంతోపాటు సాయంత్రం వేళలో శాస్త్రీయ నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. విద్యుత్ లైట్లు, క్యూలైన్లు, తాగునీటి వసతి, తదితర ఏర్పాట్లను చేశారు. 9న గ్రామోత్సవాలకు ఏర్పాట్లు చేశారు. - ఖమ్మం సాంస్కృతికం



శివపార్వతుల కల్యాణానికి గణపేశ్వరాలయం ముస్తాబు

హరోం హర

కూసుమంచి, మార్చి 7: ఖమ్మం జిల్లా కూసుమంచిలో గల గణపేశ్వరాలయం శివపార్వతుల కల్యాణానికి ముస్తాబైంది. కాకతీయుల కళాశిల్పంగా పేరొందిన ఈ శైవక్షేత్రంలో శుక్రవారం మహాశివరాత్రి జాతర జరుగనుంది. ఆలయాన్ని విద్యుద్దీపాలతో అందంగా అలంకరించారు. సర్కిల్ పరిధిలోని సుమారు వంద మంది పోలీసుల సహాయంతో ఉత్సవాల బందోబస్తు విధుల్లో పాల్గొననున్నారు. రాష్ట్ర రెవిన్యూశాఖామంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, వ్యవసాయశాఖామంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో పాటు పలువురు ప్రముఖులు మహాదేవుని దర్శించుకోనున్నారు.

ఏర్పాట్లు పూర్తి: ఆలయ ఈవో శ్రీకాంత్

శివరాత్రి పురస్కరించుకుని శివాలయంలో ఏర్పాట్లు పూర్తిచేశాం. అర్ధరాత్రి ఒంటిగంటకు లింగోద్భవ సమయంలో భక్తులకు అభిషేకంలో పాల్గొనే అవకాశం కల్పించాం. గ్రామస్తుల సహకారంతో ఏర్పాట్లు పూర్తిచేశాం.



శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయం

భక్తుల కొంగుబంగారం

శ్రీరామలింగేశ్వరస్వామి

వైరా, మార్చి 7: మండలంలోని స్నానాల లక్ష్మీపురంలో ఉన్న శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయం భక్తుల కొంగుబంగారంగా విరాజిల్లుతోంది. వందల ఏళ్ల నాటి పుణ్యక్షేత్రంగా వర్ధిల్లుతోంది. వేలాదిమంది భక్తులు శివరాత్రి పర్వదినాన రామలింగేశ్వరస్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఐదురోజులపాటు జాతర జరుగనుంది. ఈ ఆలయానికి ఎదురుగా వైరా నది ఉంది. ఆనదిలో సీతారామలక్ష్మణులు స్నానాలు ఆచరించి అక్కడ వెలిసినట్లు ప్రసిద్ధి. ఆ నదిలో సీతారామలక్ష్మణ విగ్రహాలు లభించాయని చరిత్ర. ఆ ప్రదేశాన్ని రామగుండంగా పిలుస్తున్నారు. శివరాత్రికి ముందు ఏడాది కాలంలో అశువులుబాసిన వారి బంధువులు, మిత్రులు ఇక్కడ పుణ్యస్నానాలు ఆచరించి అంటు తీర్చుకొని పిండప్రదానం చేయడం ఆనవాయితీగా వస్తోంది. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క దంపతులు శివరాత్రి పర్వదినాన ఇక్కడ జరిగే శివపార్వతుల కల్యాణమహోత్సవ క్రతువును నిర్వహించటం ఆనవాయితీగా వస్తోంది. ఇప్పటికే ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ ఇక్కడ సౌకర్యాల ఏర్పాటుపై అన్నిశాఖల అధికారులతో సమీక్షించారు. దేవాదాయ, ధర్మాదాయ, రెవెన్యూ, పోలీసు, నీటిపారుదల, పంచాయతీరాజ్, ఎక్సైజ్, మిషన్‌భగీరథ, ఆర్టీసీ, వైద్యఆరోగ్యశాఖ, అగ్నిమాపక శాఖల అధికారులు తమ తమ ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. ఈసారి శివపార్వతుల కల్యాణాన్ని బహిరంగ ప్రదేశంలో వేదికపై నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.


భక్తుల ఇలవేల్పు తీర్థాల సంగమేశ్వరుడు



ఖమ్మం రూరల్, మార్చి 7: ఖమ్మంరూరల్ మండలం తీర్థాల మహాజాతరకు ముస్తాబైంది. కొన్ని వందల ఏళ్ల క్రితం రుషుల ప్రతిష్ఠించిన తీర్థాల సంగమేశ్వర స్వామి ఆలయం భక్తుల ఇలవేల్పుగా విరాజిల్లుతోంది. తీర్థాలలో ఆకేరు, మున్నేరు, బుగ్గేరు మూడు నదులు కలిసి ప్రవహిస్తుండటంతో దానిని త్రివేణి సంగమంగా పిలుస్తుంటారు. శివరాత్రి రోజున తీర్థాల సంగమేశ్వరుడిని దర్శించుకుంటే సకల పాపాలకు విముక్తి కలుగుతుందని భక్తుల విశ్వాసం. ఈ జాతర నాలుగురోజుల పాటు నిర్వహిస్తారు. గురువారం అర్ధరాత్రి 12 గంటలకు ఆర్డీవో ప్రత్యేక పూజలు చేసి జాతరను ప్రారంభిస్తారు. ఈ ఏడాది మున్నేరులో నీరు లేకపోవడంతో భక్తుల పుణ్యస్నానాలకు ఇబ్బందులు ఏర్పడే అవకాశం ఉంది. ఏసీపీలు 2, 5 గురు సీఐలు, 15 మంది ఎస్‌ఐలు, ఏఎస్‌ఐలు, హెడ్ కానిస్టేబుల్లు, కానిస్టేబుళ్లు 270మంది, పంచాయతీ కార్యదర్శులు 15మంది, వంద మంది సిబ్బంది, ఆరు వాటర్ ట్యాంకుల ద్వారా భక్తులు తాగునీరు అందించనున్నారు.

నీలాద్రి ఆలయం ముస్తాబు

పెనుబల్లి, మార్చి 7: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా మండలంలోని నీలాద్రీశ్వర ఆలయం ముస్తాబైంది. శుక్రవారం తెల్లవారుజామున మూడుగంటల నుంచి సుప్రభాత సేవ, తీర్థపు బిందె, మంగళస్నానం, ప్రాతఃకాల అభిషేకం, మహన్యాసపూర్వక రుద్రాభిషేకం, అర్చనలు ప్రారంభమవుతాయి. రాత్రి 9.30గంటలకు నీలాద్రీశ్వరస్వామి కల్యాణాన్ని నిర్వహించారు. రాత్రి 12.30గంటలకు లింగోద్భవ కాలంలో అభిషేకాలను నిర్వహిస్తారు. శనివారం కూడా ఉదయం ఐదుగంటల నుంచి సుప్రభాత సేవ, తీర్థపుబిందె, మంగళస్నానం, ప్రాతఃకాల అభిషేకం, మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం, అర్చనలు, ఉదయం 7గంటల నుంచి ప్రత్యేక అభిషేకాలు, పదిగంటల నుంచి స్వామివారి కల్యాణ మూర్తుల ఊరేగింపు ప్రారంభమవుతుంది. స్వామివారిని దర్శించుకొనేందుకు రెండులక్షల మంది భక్తులు వస్తారని అంచనా.



2.25లక్షల నేపాల్ రుద్రాక్షలతో 14అడుగుల శివలింగం

నీలాద్రీశ్వర ఆలయంలో 2.25లక్షల నేపాల్ రుద్రాక్షలతో 14అడుగుల శివలింగాన్ని ఏర్పాటు చేశారు. తిరుమల తిరుపతికి చెందిన ప్రముఖ జ్యోతిష్యులు బోధనపు విజయ్‌కుమార్ ఈ శివలింగానికి మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం, పూజా కార్యక్రమాలను నిర్వహించనున్నారు.



ద్వీపకల్పంలో 'మోతెగడ్డ వీరభద్రుడు'

కాకతీయుల కాలంలో నిర్మించిన ఆలయంగా ప్రసిద్ధి

బూర్గంపాడు, మార్చి 7: చుట్టూ గోదావరి.. మధ్యలో ఓ గుట్టపై వేంచేసిన వీరభద్రస్వామి ఆలయం. రాష్ట్రంలోనే ఎక్కడా లేని విధంగా గోదావరి నది మధ్య లో ఉన్న ఏకైక ద్వీపకల్ప ఆలయంగా ప్రసిద్ధి కెక్కింది. బూర్గంపాడు మండలం మోతె గ్రామానికి కొద్ది దూరానికి గోదావరి నది మధ్యలో ఈ ఆల యం ఉంది. గోదావరి సమీపం నుంచి సుమారు కి.మీ దూరంలో గుట్టపై ఈ ఆలయానికి నాటు పడవల ద్వారా చేరుకోవాలి. గోదావరి నీటి ప్రవాహం ప్రమాదస్థాయికి మించి ప్రవహించినా ఆ ఆలయం ముంపునకు గురి కాలేదని పూర్వీకులు చెబుతుంటారు. ఆలయంలో గిరిజనుల సంప్రదాయ పద్ధతుల్లోనే పూజలు కొనసాగుతున్నాయి. గోదావరి మధ్యలో ఉన్న గుట్టకు మోతెగడ్డ వీరభద్రస్వామిగా భక్తు లు పిలుస్తుంటారు.

శివాలయాల్లో ఆలయం ముందు నందీశ్వరుడు కొలువుదీరి ఉంటాడు. కాని మోతెగడ్డలో మాత్రం వీరభద్రస్వామి ఆలయానికి తూర్పు భాగంలో నంది విగ్రహంతోపాటు సూర్యదేవుని ఆలయం ఉండటం విశేషం.



కోటిలింగాలలో స్వయంభు శివలింగం

మూడు రోజులు

కోటిలింగాల జాతర

కారేపల్లి మార్చి 7: మండల పరిధిలోని పోలంపల్లి గ్రామం పంచాయతీ పరిధిలో మహాశివరాత్రి పండగ సందర్భంగా మూడు రోజులపాటు జరగనున్న జాతరకు నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. శుక్రవారం తెల్లవారుజామున ప్రారంభమై మూడు రోజుల పాటు జరగనుంది. గతంలో ఈ ప్రాంతంతో సయ్యంభుగా వెలిసిన శివయ్య తనతోపాటు కోటిశివలింగాలను ఏర్పాటు చేసుకున్నాడని, కాలక్రమేణ అనేక శివలింగాలను దొంగలు ఎత్తుకపోయారని, మరికొన్ని శివలింగాలు కాలగర్భంలో కలిసి పోయినట్లు ఈ ప్రాంతప్రజలు చెబుతుంటారు. కోటిలింగాల ఆలయం వద్ద మూడు వాగులు కలుస్తుండటంతో అక్కడ మహిళలు అంటు తీర్చుకుంటారు. పితృదేవతలకు పిండప్రదానం చేసేందుకు భక్తులు భారీగా తరలివస్తుంటారు. ఇందుకు అవసరమైన ఏర్పాట్లను నిర్వాహకులు, వివిధ శాఖల అధికారులు చేస్తున్నారు. అయితే వాగులో నీరు నామ మాత్రంగా ఉంది.



స్నానాల లక్ష్మీపురానికి తాత్కాలిక రోడ్డు

- మహాశివరాత్రి జాతర సందర్భంగా ప్రత్యేక ఏర్పాట్లు
- డిప్యూటీ సీఎం భట్టి కృషితో మార్గం సుగమం

వైరా, మార్చి 7: వైరా నుంచి నేరుగా స్నానాల లక్ష్మీపురానికి వెళ్లేందుకుగానూ యుద్ధప్రాతి పదికన కొంత దూరం అవసరమైన తాత్కాలిక రోడ్డు నిర్మాణాన్ని చేపట్టా రు. ఎట్టి పరిస్థితుల్లోనూ మహాశివరాత్రి నాడు కొత్తగా నిర్మించిన రోడ్డు నుంచి తాను, భక్తులు స్నానాల లక్ష్మీపురానికి వెళ్లివచ్చేవిధంగా రోడ్డు నిర్మించాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. వెంటనే రంగంలోకి దిగిన వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ గురువారం అధికారులతో కలిసి తాత్కాలిక రోడ్డు నిర్మాణానికి అవసరమైన చర్యలు చేపట్టారు. గత ఏడాది మంజూరైన రోడ్డు గండుగలపాడు వరకు నిర్మాణం పూర్తిఅయింది. అయితే గండగలపాడుతో సంబంధం లేకుండా వైరా నుంచి జాతీయ ప్రధాన రహదారి మీదుగా స్నానాల లక్ష్మీపురానికి వెళ్లేవిధంగా కొత్తగా చేపట్టిన రోడ్డును అనుసంధానం చేయాలని అధికారులను ఆదేశించారు. దాంతో తహసీల్దార్ కేవీ.శ్రీనివాసరావు వైరా, గండగలపాడుకు చెందిన రైతులు మండడపు మధుసూదన్‌రావు, మచ్చా కృష్ణయ్య, మణిలను సంప్రదించగా వారు తమ భూములను తాత్కాలిక రోడ్డు నిర్మాణానికి ఇవ్వడానికి ముందుకొచ్చారు. అయితే ఖమ్మానికి చెందిన మేడేంపూడి బాలకృష్ణ నేషనల్ హైవే పక్కనే ఉన్న తమ భూములను రోడ్డు కోసం ఇవ్వడానికి తటపటాయిస్తున్నారు. అయితే డిప్యూటీ సీఎం ఆదేశాలతో ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ గురువారం నేరుగా క్షేత్రస్థాయిలో భూములు పరిశీలించారు. రైతులు బాలకృష్ణ, మధుసూదన్‌రావు, కృష్ణయ్య, మణిని అక్కడకు పిలిపించి వారితో ఎమ్మెల్యే చర్చలు జరిపారు.



తాత్కాలిక రోడ్డు కోసం భూయజమానులు, అధికారులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే రాందాస్‌నాయక్

మూడురోజులపాటు తమ భూముల్లోనుంచి స్నానాల లక్ష్మీపురానికి రాకపోకలు కొనసాగించేందుకుగానూ తాత్కాలిక రోడ్డు నిర్మాణానికి బాలకృష్ణ అంగీకరించారు. మిగిలిన రైతులు కూడా తమ అంగీకారాన్ని తెలిపారు. ఈ రైతులకు ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు. సీతారామ ప్రాజెక్టు ఎస్‌ఈ శ్రీనివాసరెడ్డి, ఈఈ అర్జున్, పీఆర్ డీఈ రమేష్, ఏఈ ప్రసాద్, తహసీల్దార్ కేవీ.శ్రీనివాసరావు, ట్రాన్స్‌కో ఏఈ ఎస్‌ఎస్‌ఎస్.కుమార్, వైరా మునిసిపల్ చైర్మన్ సూతకాని జైపాల్, కమిషనర్ సీహెచ్.వేణు, ఇతర అధికారులతో ఎమ్మెల్యే చర్చలు జరిపి తాత్కాలిక రోడ్డు నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. టీపీసీసీ కార్యదర్శి నూతి సత్యనారాయణ, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శీలం వెంకటనర్సిరెడ్డి, కట్ల రంగారావు, పణితి సైదులు, కర్నాటి హన్మంతరావు, నంద్రు నాగరాజు, పెద్దప్రోలు లక్ష్మయ్య, సీఐ ఎన్.సాగర్, ఎస్‌ఐ వంశీకృష్ణ భాగ్యరాజ్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌కు బీసీలు అండగా నిలవాలి

- వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను గెలిపించి తీరాలి
- కేసీఆర్‌కు కృతజ్ఞతసభలో నేతలు
- హాజరైన నామా, వద్దిరాజు, పువ్వాడ తదితరులు

ఖమ్మం,మార్చి7 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో బీసీలు బీఆర్ఎస్‌కు అండగా నిలిచి, పార్టీని గెలిపించాలని, అప్పుడే కేసీఆర్‌కు నిజమైన కృతజ్ఞత చెప్పినట్లు అవుతుందని బీఆర్ఎస్ నేతలు, కార్పొరేషన్ మాజీ ఛైర్మన్లు, మాజీ ఎమ్మెల్యేలు పేర్కొన్నారు. రాజ్యసభలో బలహీనవర్గాల గొంతుకగా వద్దిరాజు రవిచంద్ర నిలవాలని అప్పుడే బీసీలకు మరింత గౌరవం పెరుగుతుందన్నారు. రెండోసారి రాజ్యసభకు ఎన్నికైన రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్రకు ఖమ్మం బైపాస్‌రోడ్‌లో గురువారం రాత్రి కేసీఆర్‌కు కృతజ్ఞతసభ, వద్దిరాజు రవిచంద్రకు అభినందన సభ జరిగింది. ఈ సభకు ముఖ్య అతిథిగా హాజరైన బీఆర్ఎస్ లోక్‌సభా పక్షనేత నామా నాగేశ్వరరావు మాట్లాడుతూ ఖమ్మం ఎంపీగా తిరిగి నన్ను గెలిపిస్తే లోక్‌సభలో నేను, రాజ్యసభలో రవిచంద్ర పార్లమెంట్‌లో ప్రజల పక్షాన పనిచేస్తామన్నారు. కేసీఆర్ పాలనలో రూ.50వేల కోట్లతో ఖమ్మం జిల్లాను అన్ని విధాల అభివృద్ధి చేశారని, బీసీలు బీఆర్ఎస్‌కు అండగా నిలవాలన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీకి నష్టం కలిగినా, లోక్‌సభ ఎన్నికల్లో పార్టీని గెలిపించుకొని మన గౌరవాన్ని చాటుకుందామన్నారు. మళ్లీ ఎంపీగా గెలిపిస్తే అన్ని వర్గాల ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని నామా పేర్కొన్నారు. సన్మాన గ్రహీత, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర మాట్లాడుతూ రాష్ట్రంలో రాజ్యసభకు పార్టీలో ఒక్కరికి అవకాశం ఉన్నా, అది బీసీలకు కేటాయించిన ఘనత కేసీఆర్‌దన్నారు. బీఆర్ఎస్‌లో చేరిన అనతికాలంలోనే కేసీఆర్ రాజ్యసభకు తనకు అవకాశం కల్పించారని తెలిపారు. మాజీమంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ మాట్లాడుతూ వద్దిరాజుకు రెండోసారి అవకాశం ఇస్తామని కేసీఆర్ ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారని, బలహీన వర్గాల ప్రతినిధిగా రాజ్యసభలో వద్దిరాజు వ్యవహరించాలని విజ్ఞప్తి చేశారు. కృతజ్ఞతాసభలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, జడ్పీఛైర్మన్ లింగాల కమల్‌రాజ్, మాజీమంత్రి బస్వరాజు సారయ్యతో పాటు బీఆర్ఎస్ ప్రభుత్వంలో పనిచేసిన నీటిపారుదల నిపుణులు వీప్రకాష్, కవి జూలూరు గౌరీశంకర్, కార్పొరేషన్ మాజీ ఛైర్మన్లు తాడూరి శ్రీనివాస్, బాలరాజు యాదవ్, ఆంజనేయులుగౌడ్, రాజారాం యాదవ్, కొండబాల కోటేశ్వరరావు తదితరులు ప్రసంగించారు. సభలో మాజీ ఎమ్మెల్యేలు సండ్ర వెంకటవీరయ్య, తాటి వేంకటేశ్వర్లు, మదన్‌లాల్, మెచ్చా నాగేశ్వరరావు, బాణోత్ హరిప్రియ, ఖమ్మం మేయర్ పునుకొల్లు నీరజ, కొత్తగూడెం మున్సిపల్ ఛైర్‌పర్సన్ సీతామహాలక్ష్మి, డీసీసీబీ మాజీ ఛైర్మన్ కూరాకుల నాగభూషయ్య, సుడా మాజీ ఛైర్మన్ బచ్చు విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



వద్దిరాజును గజమాలతో సత్కరిస్తున్న బీఆర్ఎస్ నాయకులు



కేసీఆర్‌కు కృతజ్ఞత సభకు హాజరైన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు



వనదేవతలను దర్శించుకున్న మేడారం ట్రస్ట్‌బోర్డ్ ఛైర్మన్ లచ్చుపటేల్

వన జన జాతర

- ఇలవేల్పుల రాకతో జాతర జనసంద్రం
- వన దేవతలను దర్శించుకున్న మేడారం ట్రస్ట్‌బోర్డ్ ఛైర్మన్ అరెం లచ్చుపటేల్

గుండాల, మార్చి 7: పగిడిద్దరాజు జాతర భక్తులతో కళకళలా డుతుంది. ఆదివాసీల ఆరాధ్య దేవతలు సమ్మక్క, పగిడిద్దరాజు గద్దెపైకి రావడంతో భక్తులు పులకించారు. గుండాల మండలం వేపలగడ్డ గ్రామానికి చెందిన అరెం వంశీయుడు 'పగిడిద్దరాజు జాతర' అంగరంగ వైభవంగా జరుగుతుంది. బుధవారమే పగిడిద్దరాజును గద్దెకు చేర్చగా గురువారం వనం (సమ్మక్క) గద్దెలకు చేరడంతో నిండు జాతర మొదలైంది. కుంకుమ భరిణ రూపంలోని సమ్మక్క తల్లి మాడిమోరి గుట్ట నుంచి జనంలోకి అడుగిడింది. క్రమంలోనే పెళ్లి కుమారుడిగా ముస్తాబైన అరెం వశీయుడు పగడిద్దరాజు వనం బాటపట్టారు. సమ్మక్కకు ఎదురెళ్లి ఆదివాసీ సంప్రదాయాల నడుమ సమ్మక్క, పగిడిద్దరాజులకు వివాహం జరిపించారు. పగిడిద్దరాజు ఆభరణాలు, శివ సత్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించి సమ్మక్క, పగిడిద్దరాజును గిరిజన నృత్యాలతో సాంప్రదాయ డప్పువాయిద్యాల నడుమ ఊరేగింపుతో గద్దెలపైకి చేర్చి ప్రతిష్ఠించారు. పూజారులు, వడ్డెలు, తలపతులు అప్పయ్య, నాగయ్య, భిక్షం, బుచ్చయ్యలు దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. జాతరకు వచ్చే భక్తుల సౌకర్యార్థం నిర్వాహకులు అరెం లచ్చుపటేల్, లక్ష్మీనర్సు, కాంతారావు, చిన్న కాంతారావు, లక్ష్మయ్య, సమ్మయ్య, సత్యం, భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేశారు, గుండాల సీఐ రవీందర్, ఎస్సై రాజశేఖర్ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

వనదేవతలను దర్శించుకున్న అరెం లచ్చుపటేల్.. మేడారం ట్రస్ట్‌బోర్డ్ ఛైర్మన్ అరెం లచ్చుపటేల్ వన దేవత లు పగడిద్దరాజు, సమ్మక్కను ధర్శించుకొని తరించారు. తలపతులు, పూజారులు, గ్రామస్తులు స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. జాతరలు గిరిజన సాంప్రదాయాలకు ప్రతీకలని, ఆదివాసీల పురోగతికి పాటుపడుతామని అన్నా రు. గత ప్రభుత్వాల పాలనలో ఆదివాసీ ఇలవేల్పుల జా తరలకు ఆదరణ కరువైందని తెలిపారు. మంత్రి సీతక్క ఆధ్వర్యం ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి ప్రతీ ఇలవేల్పు జా తరకు నిధులు మంజూరి చేపిస్తామని అన్నారు. తమ ఇలవేల్పు పగడిద్దరాజు జాతర అభివృద్ధికి పాటుపడతామన్నారు.





సమ్మక్కను గద్దెమీదకు తీసుకొస్తున్న పూజారులు, పగిడిద్దరాజు, సమ్మక్క ఎదురెళ్లు కార్యక్రమం

కొత్త పోలింగ్ కేంద్రాలను గుర్తించండి: కలెక్టర్

ఖమ్మం కలెక్టరేట్, మార్చి7: లోక్‌సభ ఎన్నికలకు ఏదేని పోలింగ్ కేంద్రంలో 1500 కన్నా ఎక్కువ ఓటర్లు వున్నా, ఓటర్లు నివసించే ప్రాంతానికి , పోలింగ్ కేంద్రానికి 2 కిలోమీటర్ల ఎక్కువ దూరం వున్న ప్రాంతాలను గుర్తించాలని కలెక్టర్ గౌతమ్ రాజకీయ పార్టీల నేతలను కోరారు. అక్కడ కొత్త పోలింగ్ కేంద్రా లను ఏర్పాటుచేయనున్నట్లు ఆయన తెలిపారు. గురువారం ఆయన అన్ని డీపీఆర్సీ భవనంలో అన్ని రాజకీయ పార్టీ ప్రతినిధులతో లోకసభ ఎన్నికల ప్రక్రియ , ఎమ్మెల్సీ పట్టభద్రుల ఓటర్ల జాబితా పై ఆయన సమీక్షించారు. జిల్లాలో మరో నాలుగు కొత్త పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, ఐదు పోలింగ్ కేంద్రాల పేరు మార్పు మారో పోలింగ్ కేంద్రం ప్రదేశం మార్పుచేయాలంటూ ప్రతిపాదనలు వచ్చినట్లు రాజకీయ పార్టీలకు వివరించినారు. సమా వేశంలో రాజకీయపార్టీల ప్రతినిధులు గోపాల్‌రావు, ఎన్ రవికుమార్, స్వర్ణ సుబ్బారావు, ఆర్ ప్రకాష్, బి ఉపేంద్ర సాహు, చీకటి రాంబాబు, కృష్ణప్రసాద్ పాల్గొన్నారు.

11న పండితాపురం సంత వేలం

కామేపల్లి, మార్చి 7: కామేపల్లి మండల పరిధిలోని పండితాపురం శ్రీకృష్ణప్రసాద్ పశువుల సంత వేలం పాట ఈ నెల 11న నిర్వహిస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి గుగులోత్ నెహ్రూ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 5న నిర్వహించాల్సిన సంత వేలం పాట కొన్ని అనివార్య కారణాలతో రద్దు చేసినట్లు తెలిపారు. ఈ వేలం పాటను షెడ్యూల్డ్ తెగలకు చెందిన వారు పాటలో పాల్గొనావచ్చని తెలిపారు. దారావత్తు సొమ్ము రూ.30లక్షలు చెల్లించి పాటలో పాల్గొనాలని తెలిపారు.

జిల్లా ఉద్యాన అధికారిగా బీవీ రమణ



ఖమ్మం వ్యవసాయం, మార్చి 7: ఖమ్మం జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ అధికారిగా బి.వి. రమణ నియమిస్తూ రాష్ట్ర ఉద్యాన శాఖ డైరెక్టర్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. రమణ ప్రస్తుతం ఖమ్మం డిప్ ఇరిగేషన్ పీడీగా పనిచేస్తున్నారు. ప్రస్తుతం ఉద్యాన అధికారిగా పని చేస్తున్న జి. అనసూయను ములుగు జిల్లా ఇన్‌చార్జ్‌గా నియమిస్తూ బదిలీ చేశారు. బీవీ రమణ గతంలో వివిధ హోదాల్లో ఖమ్మం జిల్లాలో పనిచేశారు.ప్రాజెక్టు ఉద్యాన అధికారిగా ఆదిలాబాద్ జిల్లా ఉట్నూరు ఐటీడీఏ నందు 3 సం., తరువాత ములుగు జిల్లా ఉద్యాన అధికారిగా పనిచేశారు.

అందరి వాడు రాంరెడ్డి వెంకటరెడ్డి

● సంస్మరణ సభలో కుటుంబ సభ్యులు, నాయకులు

ఖమ్మం సంక్షేమవిభాగం, మార్చి 7: దివంగత మాజీ మంత్రి రాంరెడ్డి వెంకటరెడ్డి అందరివాడు అని ఆయన సోదరుడు, మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి, ఖమ్మం ఏఎంసీ మాజీ ఛైర్మన్ మానుకొండ రాధాకిషోర్ పేర్కొన్నారు. గురువారం హైదరాబాద్‌లో కుటుంబ సభ్యులు ఆధ్వర్యంలో రాంరెడ్డి వెంకటరెడ్డి సంస్మరణ సభను నిర్వహించారు. వెంకటరెడ్డి సతీమణి సుచరిత, సోదరులు రాంరెడ్డి గోపాలరెడ్డి, కాంగ్రెస్ నాయకులు రాంరెడ్డి చరణ్‌రెడ్డి తదితరులు రాంరెడ్డి వెంకటరెడ్డికి నివాళులు అర్పించారు.

ఎమ్మెల్యేకు పంచాయతీ కార్యదర్శుల వినతి

సమస్యలు పరిష్కరించాలని వేడుకోలు



వినతిపత్రం అందజేస్తున్న కార్యదర్శులు

అశ్వాపురం మార్చి 7: ప్రభుత్వ సెలవుదినాలను వినియోగించుకునేలా తమకు సహకరించి,తమసమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెల్లాలని కోరుతూ గురువారం మండల పంచాయతీ కార్యదర్శుల సంఘం ఆధ్వర్యంలో పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేశారు. వరుసగా మూడురోజుల సెలవు దినాల్లో స్పెషల్ డ్రింకింగ్ వాటర్ డ్రైవ్‌లో కార్యదర్శులందరూ పాల్గొనాలని పంచాయతీరాజ్ కమీషనర్ మౌఖిక ఆదేశాలు జారీ చేయటంతో కార్యదర్శులు మానసిక ఒత్తిడికి గురవుతున్నారని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ప్రతి ప్రభుత్వ కార్యక్రమంలో క్షేత్ర స్థాయిలో ముందుండి పనిచేసే కార్యదర్శులకు సెలవు దినాల్లోకూడా విధులకు హాజరుకావాల్సి రావటం వ్యక్తిగత ఇబ్బందులకు గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. అదేవిధంగా తమకు సహకరించాలని కోరుతూ ఎంపిపి ముత్తినేని సుజాత, ఎంపిడివో వరప్రసాద్ కు వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు ఎస్.కృష్ణచైతన్య, కార్యదర్శులు సైదులు,ప్రవీణ్‌కుమార్, జ్యోతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ రహదారులకు మహర్దశ: కూనంనేని

లక్ష్మీదేవిపల్లి, మార్చి 7: కొత్తగూడెం నియోజకవర్గంలోని గ్రామీణ రహదారులకు మహర్థశ రాబోతుందని, వివిధ పథకాలతో నియోజకవర్గ వ్యాప్తంగా రహదారుల నిర్మాణాలు వేగవంతంగా జరుగుతున్నాయని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. మండల పరిధిలోని రేగళ్ల, ఖైలారం, బంగారుచెలక, చంద్రాలగూడెం తదితర గ్రామాల్లో రోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులకు గురువారం ఎమ్మెల్యే శంఖుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు మౌలిక వసతులు, పెండింగ్ సమస్యల పరిష్కారమే అజెండాగా ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్నామన్నారు. ఎన్నికల ప్రచారంలో ప్రజల నుంచి వచ్చిన విజ్ఞప్తుల మేరకు ఎన్ఆర్ఈజీఎస్, డీఎంఎఫ్, సీఆర్ఆర్ తదితర పథకాల కింద రోడ్లు, డ్రైనేజీల నిర్మాణాలకు నిధులు మంజూరు చేయించి పనులు చేపడుతున్నామన్నారు. పనులు నాణ్యతా ప్రమాణాలతో జరిగేలా అధికారులు, ప్రజలు పర్యవేక్షించాలని సూచించారు. ఈ కార్యక్రమాల్లో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్కే. సాబీర్‌పాషా, లక్ష్మీదేవిపల్లి ఎంపీపీ భూక్యా సోనా, తహసీల్దార్ వర ప్రసాద్, పంచాయతీరాజ్ ఎఈ రామకృష్ణ, స్పెషల్ ఆఫీసర్ వెంకటస్వామి, ఎంపీటీసీ నూనావత్ గోవింద్, సలిగంటి శ్రీనవాస్, వార్డు కౌన్సిలర్లు, స్థానికులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ఇసుక ర్యాంపుతో ఊరట

సుదీర్ఘకాలం తర్వాత కొత్తగూడెం కేంద్రంలో ఇసుక ర్యాంపు ప్రారంభించుకోవడం వల్ల గృహయజమానులకు ఊరట లభిస్తుందని, ప్రభుత్వ అభివృద్ధి పనులు సైతం వేగవంతంగా జరుగుతాయని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు తెలిపారు. లక్ష్మీదేవిపల్లి మండలం చాతకొండ పరిధిలోని చాటివారిగూడెంలో 'మన ఇసుక - మన వాహనం' పేరుతో ఏర్పాటు చేసిన ఇసుకర్యాంపును ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఇంటి నిర్మాణాలకు ఇసుక అందుబాటులో లేకపోవడం వల్ల నియోజకవర్గ కేంద్రంతోపాటు పరిసర గ్రామాల గృహయజమానులు తీవ్ర ఇబ్బందులు పడటాన్ని గుర్తించి ఇసుకర్యాంపు ఏర్పాటుకు కృషి చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్కే. సాబీర్‌పాషా, మండల తహసీల్దార్ వర ప్రసాద్, ఎంపీడీవో చలపతిరావు, పంచాయతీరాజ్ ఎఈ రామకృష్ణ, ఎంపీవో శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి శివాని, ఎస్ఆర్‌వో రాము, ఎంపీపీ సోనా, ఎంపీటీసీ గోవింద్, పీఎస్‌సీఎస్ చైర్మన్ కూచిపూడి జగన్నాథం, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

నూతన పద్ధతులతో అధిక లాభాలు

కొత్తగూడెం: వ్యవసాయ రంగంలోకి వచ్చిన నూతన పద్ధతులు అవలంబిస్తే తక్కువ ఖర్చుతో అధిక దిగుబడిని పొందేందుకు వీలుంటుందని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. త్రీ ఇంక్లైన్ కృషి విజ్ఞాన కేంద్రంలో గురువారం ఏర్పాటుచేసిన కిసాన్‌మేళ కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ఆయన ప్రారంభించారు. అనంతరం జరిగిన సదస్సులో ఎమ్మెల్యే మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో ఆధునాతన పరిజ్ఞానాన్ని జోడిస్తేనే ఆశించిన ఫలితాలు దక్కుతాయన్నారు. ప్రస్తుతం అధునాతనమైన వ్యవసాయ పరికరాలు అందుబాటులోకి వచ్చాయని వాటి ద్వారా పెట్టుబడితోపాటు సమయం ఆదా అవుతుందని, వ్యవసాయశాఖ, ఉద్యానవనశాఖాధికారులు ఎప్పటికప్పుడు తగిన సలహాలు అందచేయాలని, శాస్త్రవేత్తలు క్షేత్రస్థాయిలో పర్యటించి వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకునే అంశాలపై రైతులకు అవగాహన కల్పించాలని కోరారు. ఈ సందర్భంగా పలువుర అభ్యుదయ రైతులను శాలువాలతో సత్కరించి జ్ఞాపకాలను అందచేశారు. అనంతరం వివిధ కంపెనీలు, వ్యవసాయశాఖాధికారులు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను తిలకించారు. ఈ కార్యక్రమంలో అధికారులు బాబురావు, సూర్యనారాయణ, వెంకట్రావ్, దామోదర రెడ్డి, వీరహన్మంతరావు, అలీ, రమేష్ కుమార్, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్కే. సాబీర్‌పాషా, రవి సీడ్స్ అధినేత రవి, వ్యవసాయ శాఖ, అనుబంధశాఖల అధికారులు, దేశి డీలర్లు వివిధ సంస్థల ప్రతినిధులు, అభ్యుదయ రైతులు తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న కూనంనేని

కలెక్టర్ శుభాకాంక్షలు

కొత్తగూడెం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): వివిధ రంగాల్లో మ హిళలే బలవంతులని కలెక్టర్ ప్రియాంక అల అన్నారు. అం తర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని గురవారం ఐడీఓసీ కార్యాలయంలో రెవిన్యూ మహిళా ఉద్యోగులు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడు తూ.. మహిళలు పురుషులతో సమానంగా పోటీ పడుతున్నా రన్నారు. మహిళలు లేకపోతే ప్రపంచం నడవదని, నదుల పేర్లు మహిళల పేరునే ఉన్నాయని, మహిళల వద్ద శాంతి సహ నం ఉందని తెలిపారు.

గద్దెలపై కొలువు దీరిన సమ్మక్క



సమ్మక్కను తోడ్కొని వస్తున్న పూజారులు

మణుగూరు, మార్చి 7: మణుగూరు మునిసిపాలిటీ పరిధిలోని చినరావిగూడెం గిరిజన గ్రామంలో గల సమ్మక్క సారక్కల దేవాలయంలో గత రెండు రోజులుగా తిరుగు జాతర మహోత్సహం ఎంతో వైభవంగా జరుగుతోంది. గురువారం సాయంత్రం ఆలయ పూజారులు కుంజా లక్ష్మి, భద్రయ్య తదితరులు గిరిజన సాంప్రదాయ పద్ధతిలో డోలు వాయిద్యాలు, యువత సాంప్రదాయ నృత్యాల మధ్య ఎంతో కన్నుల పండుగగా సమ్మక్కను వనం నుంచి తీసుకుని వచ్చి గద్దెలపై ప్రతిష్టించారు. కోరిన కోర్కెలు తీర్చే తల్లుగా కొలువు దీరిన సమ్మక్క సారలమ్మలను గద్దెలపై ప్రతిష్టించడం తో దీంతో నిండు జాతర పూర్తి అయింది. జాతర ప్రతి ఘట్టం ఆధ్యాత్మం భక్తి శ్రద్దలతో నిర్వహించారు. ఆదివాసీ యువతీ యువతులు, గృహిణులు సమ్మక్క గద్దెపై చేరుకుంటున్న తరుణంలో వనదేవతలకు నీళ్లారబోసి తమ మొక్కులను మొక్కుకున్నారు. ఈసందర్భంగా ఆలయ ప్రాంగణంలో అన్నదానాన్ని నిర్వహించారు. రాయగూడెం గ్రామస్థులతో పాలు పరిసర ప్రాంతాల ప్రజలు జాతర మహోత్సవాన్ని తిలకించి వనదేవతల అన్న దాన ప్రసాదాన్ని స్వీకరించారు.

ప్రతీ కుటుంబానికి సంక్షేమ ఫలాలు: ఎమ్మెల్యే జారే

అశ్వారావుపేట రూరల్, మార్చి 7: కాంగ్రెస్ పాలనలో అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి సంక్షేమ ఫలాలు అందుతాయని, పేదల సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగుతుందని ఎమ్మెల్యే జారే ఆదినారాయణ అన్నారు. మీ ఇంటికే మీ ఎమ్మెల్యే కార్యక్రమంలో భాగంగా గురువారం మండల వ్యాప్తంగా దాదాపు 19 గ్రామాల్లో కళ్యాణలక్ష్మీ, షాదిముబారక్ చెక్కులను లబ్దిదారులకు పంపిణీ చేశారు. తాగునీటి సమస్య, వంతెనలు, రోడ్లు ఇలా పలు సమస్యలను ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజాపాలనలో పథకాల ఫలాలు నేరుగా పేదల వద్దకే వస్తాయన్నారు. పేద ప్రజల ఆశలతో ఏర్పడిన ప్రభుత్వం పేదల సంక్షేమానికే పాటుపడుతుందన్నారు. నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లోనూ అభివృద్ధి చేసేందుకు నిరంతరం శ్రమిస్తున్నానని తెలిపారు. ఎక్కడ సమస్య ఉన్నా అక్కడకు వెళ్లి పరిష్కరిస్తానని అన్నారు. కార్యక్రమంలో తహసీల్దారు కృష్ణప్రసాద్, కాంగ్రెస్ జిల్లా నాయకులు జూపల్లి రమేశ్‌తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, మాజీ సర్పంచులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

జేవీఆర్ ట్రస్ట్ సేవలు చిరస్మరణీయం

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి సర్ధార్ జలగం వెంగళరావు ట్రస్ట్ ద్వారా వారి తనయులు మాజీ మంత్రి జలగం ప్రసాదరావు చేపడుతున్న సేవలు చిరస్మరణీయమని, ట్రస్ట్ ద్వారా గిరిజన ప్రాంతాల్లో వేలాది ఎకరాలకు సాగునీరంది రెండు పంటలను పుష్కలంగా పండిస్తున్నారని ఎమ్మెల్యే జారే ఆదినారాయణ అన్నారు. అశ్వారావుపేట మండలంలోని నెమలిపేట గిరిజన గ్రామంలో గురువారం గిరిజన రైతులకు ట్రస్ట్ ద్వారా మోటార్లు, పంపుసెట్లు పంపిణీ చేశారు. విద్యుత్తు లైన్లు ఏర్పాటు చేయించి గురువారం మోటార్లను ప్రారంభించే కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే జారే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. పొలాల వద్ద ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, మాజీ మంత్రి ప్రసాదరావు మోటార్లను ఆన్‌చేసి వ్యవసాయానికి నీటిని అందించే కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే ఆదినారాయణ మాట్లాడారు. కార్యక్రమంలో ఏడీ వెంకటేశ్వర్లు, తహసీల్దారు కృష్ణప్రసాద్, సహకార సంఘం ఛైర్మన్లు పుల్లారావు, సత్యనారాయణ, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే జారే

ఘనంగా మహిళా దినోత్సవం

దమ్మపేట, మార్చి 7: మండలంలోని అంకంపాలెం ఆశ్రమ ఉన్నత పాఠశాలలో గురువారం మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా జరిపారు. దమ్మపేటలో యూటీఎఫ్ ఆధ్వర్యంలో వేడుకలు జరిపారు. వేడుకల సందర్భంగా మహిళా ఉపాధ్యాయులను సన్మానించారు. ఈసందర్భంగా పలువురు మాట్లాడారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు, నాయకులు పాల్గొన్నారు.

10న ఫైనల్ స్క్రీనింగ్ టెస్టు

భద్రాచలం, మార్చి 7: గురుకులం సెంటర్ ఫర్ ఎక్సలెన్సు కళాశాలలో ప్రథమ సంవత్సరంలో ప్రవేశం కోసం ఫైనల్ స్క్రీనింగ్ టెస్టు ఈ నెల 10న భద్రాచలం గురుకుల కళాశాలలో నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎం.దేవదాసు ఒక ప్రకటనలో తెలిపారు. స్క్రీనింగ్ టెస్టు ఒకటిలో అర్హత సాధించిన వారు తమ హాల్ టికెట్, అడ్రస్‌ప్రూఫ్‌లలో ఏదైనా ఒకటి తీసుకొని పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని అన్నారు. పరీక్ష ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరుగుతుందని అన్నారు.

మహిళా టీచర్లకు ఘన సన్మానం



సన్మానం పొందిన టీచర్లు

దుమ్ముగూడెం, మార్చి 7: నరసాపురం జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా గురువారం మహిళా టీచర్లను ఘనంగా సన్మానించారు. మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని, వారు ముందుంటే కుటుంబం, రాష్ట్రం, దేశం ముందుంటాయని ఇన్‌చార్జ్ హెచ్‌ఎం అనీల్‌కుమార్ అన్నారు. టీచర్లు తెల్లం సరస్వతి, ఆర్‌కె జయ, తాటి సీత, కల్తీ లక్ష్మి, గుండి నాగమణి, కార్మికులు తులసి, స్వరూపలను శాలువాలతో సన్మానించారు.

మహిళలకు రక్షణగా చట్టాలు: మెజిస్ట్రేట్

మణుగూరుటౌన్, మార్చి 7: మహిళలకు రక్షణగా చట్టాలు ఉన్నాయని, వాటిపై మహిళలందరు అవగాహన కలిగి ఉండాలని మణుగూరు ప్రథమ శ్రేణి జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ ఎం.వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం మణుగూరు కోర్టు ఆవరణలో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలో ఆయన ముఖ్య అతిధిగా పాల్గొని మాట్లాడారు. మహిళల కోసం ఇండియన్ పీనల్‌కోడ్ ద్వారా రక్షణ కల్పించేందుకు ప్రత్యేక సెక్షన్లు పొందుపరచబడ్డాయన్నారు. మహిళలపై జరిగే నేరాలకు సంబంధించి పలు చట్టాలు మహిళలకు రక్షణగా ఉన్నాయన్నారు. వాటిన్నిటిపై మహిళలు అవగాహన పెంపొందించుకోవాలన్నారు. అనంతరం సఖీ వన్ స్టాప్ సెంటర్ కౌన్సిలర్ రాజమణి, జిల్లా సాధికారత కేంద్రం కో-ఆర్డినేటర్ సంతోషి రూపా, దిశ మండల అధ్యక్షురాలు అనితలు మాట్లాడారు. మహిళలకు తాము ఎల్లప్పుడు అండగా ఉంటామని ఏ సమస్యల వచ్చిన టోల్ ఫ్రీ నంబర్‌కు కాని కార్యాలయ నంబర్‌లకు ఫోన్ చేసి తమ సమస్యలను చెప్పుకోవచ్చన్నారు. 100కు చెప్పుకుంటే వారు తమకు సమాచారం అందిస్తారని తెలిపారు.



మహిళా న్యాయవాదులతో కేక్ కట్ చేస్తున్న మెజిస్ట్రేట్

మహిళలు స్వయం సమృద్ధి సాధించాలి

అశ్వాపురం మార్చి 7: మహిళలు స్వయం సమృద్ధిసాధించుకుని,అన్నిరంగాల్లో రాణించాలని ఎంపీపీ ముత్తినేని సుజాత అన్నారు. అంతర్జాతీయ మహిళాదినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం అశ్వాపురం రైతువేదికలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని ఆమె కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. కార్యక్రమంలో గొందిగూడెం ఎంపీటీసీ కొమరం చిట్టెమ్మ, మొండికుంట ఎంపీటీసీ కమటం నరేష్, ఈజీఎస్ ఏపీవో విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలి

బూర్గంపాడు, మార్చి 7: మహిళలు పురుషులతో సమానంగా అన్ని రంగాలలో ముందు ఉండాలని జడ్పీటీసీ సభ్యురాలు కామిరెడ్డి శ్రీలత అన్నారు. బూర్గంపాడు గ్రామపంచాయతీ కార్యాలయంలో ఈవో సమ్మయ్య అధ్యక్షతన గురువారం అంతర్జాతీయ మహిళ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జడ్పీటీసీ కామిరెడ్డి శ్రీలత ముఖ్యాతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపి పలువురు మహిళలను సన్మానించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచు సిరిపురపు స్వప్న, ఆశాకార్యకర్తలులు పాల్గొన్నారు.

ఆనందోత్సాహాల నడుమ మహిళా దినోత్సవం

అశ్వారావుపేట రూరల్, మార్చి 7: అశ్వారావుపేటలోని ఐకేపీ కార్యాలయ ఆవరణలో గురువారం మహిళా దినోత్సవ వేడుకలను ఆనందోత్సహాల నడుమ నిర్వహించారు. కార్యాలయ ఆవరణలో ఐకేపి సిబ్బందికి, మహిళలకు వివిధ రకాల పోటీలను నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందించారు. వేడుకల్లో భాగంగా పలువురు అధికారుకు ఘనంగా సత్కారం నిర్వహించారు. ఈసందర్భంగా ఏపీఎం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లోనూ మరింతగా రాణించాలని కోరారు. కార్యక్రమంలో ఐకేపీ సిబ్బంది ఉన్నారు.

అర్హులందరికీ ఆరు పథకాలు: ఎమ్మెల్యే



సీసీ రహదారికి శంకుస్థాపన చేస్తున్న వైరా ఎమ్మెల్యే రాములు నాయక్

జూలూరుపాడు, మార్చి 7: ఎన్నికలకు ముందు ప్రజలకిచ్చిన హామీలలో భాగంగా కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులైన వారందరికి ఆరు గ్యారంటీ పథకాలను తప్పకుండా అందిస్తుందని, ఇప్పటికే ఉచిత బస్సు, రూ.10 లక్షల ఆరోగ్యశ్రీ, 200 యూనిట్‌ల ఉచిత విద్యుత్ పథకాలను అందించడం జరిగిందని త్వరలోనే గ్యాస్, ఇందిరమ్మ ఇళ్లను అందిస్తామని వైరా నియోజకవర్గ శాసన సభ్యులు మాలోత్ రాందాస్‌నాయక్ అన్నారు. గురువారం ఆయన మండలంలోని అన్నారుపాడు, పాపకొల్లు, పడమటనర్సాపురం, జూలూరుపాడు, వెంగన్నపాలెం గ్రామాలలో పర్యటించి ఈజీఎస్ నిధులతో నిర్మిస్తున్న రూ.44 లక్షల సీసీ రహదా రులకు, సాయిరాంతండాలో రూ.10 లక్షలతో నిర్మిస్తున్న సైడ్ డ్రైనేజీ నిర్మాణా నికి శంకుస్థాపన చేశారు. వెంగన్నపాలెం పంచాయతీలో రూ.5.22 కోట్ల డీఎంఎఫ్‌టీ నిధులతో ప్రధాన రహదారి విస్తర్ణ, సైడ్ డ్రైన్‌లు, సెంట్రల్ లైటింగ్ పనులను చేపట్టడంతో సెంట్రల్ లైటింగ్‌ను ఆయన ప్రారంభించారు. జూలూరుపాడులో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేయడంతో పాటు, ప్రజా మరుగుదొడ్లను నిర్మించాలని కోరుతూ బీఎస్పీ మండల అధ్యక్షుడు తంబర్ల నరసింహారావు ఎమ్మెల్యేకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివంగత ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డి ఇచ్చిన పోడు భూము ల్లో బోర్లు వేయించుకోవడానికి అటవీ చట్టాలు అడ్డంకిగా మారడంతో రైతులు ఇబ్బందులు పడుతుండడంతో ఎన్నికలకు ముందు తాను పోడు రైతులకు ఇచ్చిన హామీలో భాగంగా పోడు భూముల్లో బోర్లు వేయించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. పోడు రైతులందరూ గిరివికాస్ పథకానికి దరఖాస్తు చేసుకొని బోర్లు వేయించుకోవాలని కోరారు. వచ్చే డిసెంబరు నాటికి సీతారామ జలాలతో వైరా నియోజకవర్గంలోని నాలుగు మండలాల చెరువులతో పాటు, వైరా చెరువును నింపుతామని అన్నారు. ఇందిరమ్మ రాజ్యంలో పేదలందరికి సంక్షేమ ఫలాలు అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వం ధ్యేయమని అన్నారు. కాంగ్రెస్ పార్టీని ప్రజలందరూ ఆదరించాలని కోరారు. నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా తాను పనిచేస్తునాననని అన్నారు. ఎన్ని నిధులైనా వెచ్చించి, నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తున్నానని అన్నారు.

దరఖాస్తుల తప్పుల సవరణ పరిశీలన



దరఖాస్తులను పరిశీలిస్తున్న విద్యాచందన

పాల్వంచ టౌన్, మార్చి 7: ప్రజాపాలన దరఖాస్తుదారుల తమ దరఖాస్తుల్లో గృహజ్యోతి, గృహలక్ష్మి అర్హత నమోదులో జరిగిన తప్పు ఒప్పుల సవరణ పక్రియను ఇన్‌చార్జి అడిషనల్ కలెక్టర్ (లోకల్ బాడీ) విద్యాచందన పరిశీలించారు. గురువారం పాల్వంచ మున్సిపల్ కార్యాలయాన్ని ఆకస్మికంగా సందర్శించి ప్రత్యేక కౌంటర్ల ద్వారా జరుగుతున్న సవరణ పక్రియను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్రజాపాలన దరఖాస్తుల్లో రేషన్‌కార్డు నెంబరు తప్పు నమోదు, ఆధార్ తప్పు నమోదు, కరెంట్ యూఎస్‌సీ, నెంబరు వంటివి తప్పులు దొర్లడంతో వాటి అమలు కాలేదని గుర్తించారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దరఖాస్తుల్లో తప్పుల సవరణను ప్రత్యేక కౌంటర్ల ద్వారా సరి చేస్తున్నట్లు ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ ఎ. స్వామి, మేనేజరు ప్రసాద్ బాబు, సిబ్బంది గొడుగు వెంకట్, రవి, కిరణ్, ఆర్‌వో వెంకటలక్ష్మి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ కేవీ. లక్ష్మణరావు, కంప్యూటర్ ఆపరేటర్ సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

మహిళా దినోత్సవంలో పాల్గొన్న మెజిస్ట్రేట్

భద్రాచలం, మార్చి 7: అంతర్జాతీయ మహిళ దినోత్సవాన్ని పురస్కరించుకొని భద్రాచలం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం జరిగిన వేడుకల్లో భద్రాచలం జ్యూడిషియల్ మేజిస్ట్రేట్ కె. సూరిరెడ్డి పాల్గొన్నారు. ఈ క్రమంలో ఆయన కళాశాల ప్రాంగణంలో మొక్కను నాటారు. అనంతరం అయన మాట్లాడుతూ మహిళల గురించి ఎందరు ఎన్ని చెప్పిన తక్కువే, మహిళలు ఉన్న అవకాశాలను అందిపుచ్చుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రన్సిపాల్ జాన్సన్‌మిల్టన్, వైస్ ప్రిన్సిపాల్ భద్రయ్య, ఎస్సై విజయలక్ష్మి, న్యాయవాదులు శారద, సత్యనారాయణ, అధ్యాపకురాలు నాగసమీరా, హిమజ, రేవతి, నాగేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

పార్లమెంట్ ఎన్నికల్లో సీట్లు కేటాయించాలి

ఇల్లెందురూరల్, మార్చి7: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ఎస్టీలకు కేటాయించిన సీట్లల్లో ఆదివాసీ అభ్యర్థులను నిలపాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ జాతీయ అధ్యక్షులు దాట్ల నాగేశ్వరావు, తుడందెబ్బ రాష్ట్ర అధ్యక్షులు ఈసం సుధాకర్ కోరారు. గురువారం ఇల్లెందులో జరిగిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ భారత రాజ్యాంగం ఆదివాసులకు కల్పించిన హక్కులు నిర్వీర్యం అవుతున్నయని ఆవేదన వ్యక్తం చేశారు. అదిలాబాద్, మహబుబాబాద్ రిజర్వుడ్ స్థానల్లో వివిధ పార్టీలు ఆదివాసులకు కాకుండా వలస లంబాడిలకు టికెట్‌లు కేటాయించేందకు సిద్ధం అవుతున్నరని, ఆదివాసులు ఉద్యోగ, ఉపాధి, విద్య, రాజకీయ రంగంలో వలస వాదుల చేతిలో దగపడుతున్నరని ఆవేదన చెందారు.మహబుబాబాద్ పార్లమెంట్ స్థానంలో లంబాడీల కంటే ఆదివాసులు 70వేల ఓట్లు అధికంగా ఉన్న మూడు ధఫాలుగా ఆదివాసులకు టిక్కెట్ కేటాయించకుండా లంబాడా సమాజిక వర్గానికి ఇచ్చారని తెలిపారు. నేడు ఇప్పటికే బీఆర్ఎస్ లంబాడాలకు కేటాయించిందని, కాంగ్రెస్, బీజేపీలు ఆదివాసీ అభ్యర్థులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు.